ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
ఆదివారం 8 జూన్ 2025

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 27.0

పీజీఆర్ఎస్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చు

ఏలూరు,జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కారాన్ని మరింత వేగవంతంగా చేయడానికి జిల్లా స్థాయిలో ఏలూరుతో పాటు మండల, మున్సిపల్, డివిజనల్ స్థాయిల్లో నిర్వహిస్తున్నామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న పీజీఆర్ఎస్ యథావిధిగా సోమవారం నిర్వహిస్తున్నామని, ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు ప్రభుత్వం అందించిన అధికారిక వెబ్‌సైట్ :హెచ్‌టీటీపీఎస్://మీకోసం.ఏపీ.జీవో.ఇన్ ను వినియోగించుకోవచ్చన్నారు. ఫిర్యాదు నమోదు సమాచారం తెలుసుకోవాలంటే 1100 టోల్‌ఫ్రీకు కాల్ చేయవచ్చన్నారు.

డబ్బులిస్తే ఉద్యోగం!

- ప్రభుత్వశాఖల్లో కొలువులంటూ రూ.53 లక్షల వసూలు
- తరువాత పత్తాలేకుండా పోయిన వైనం
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- నలుగురి అరెస్టు.. మరో నలుగురు పరార్

లోపలి పేజీలో..



• త్యాగానికి ప్రతీక బక్రీద్

జిల్లా వ్యాప్తంగా శనివారం బక్రీద్ పర్వదిన వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్వార్థం, అసూయ, రాగద్వేషాలు లేని త్యాగనిరతిని వ్యాపింపచేయడమే బక్రీద్ పండుగ ముఖ్య ఉద్దేశమని మత పెద్దలు వివరించారు. చిత్రంలో ఏలూరు కర్బలా మైదానంలో ప్రత్యేక నమాజ్ చేస్తున్న ముస్లింలు.



• మద్దీ ఆంజనేయుడికి పంచామృత అభిషేకం

మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆలయ ముఖ మండపంలో ఉత్సవ మూర్తికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. వివిధ సేవల రూపంలో స్వామికి రూ.1,62,643 ఆదాయం సమకూరినట్టు ఈవో చందన తెలిపారు.

- జంగారెడ్డిగూడెం

బడి గంటలు మోగే వేళ..

సర్కారు బడుల్లో సమస్యలెన్నో

- ఎక్కడికక్కడ నిలిచిన నాడు-నేడు పనులు
- అదనపు తరగతి గదులు చాలాచోట్ల లేనట్లే
- ప్రహరీ, మరుగుదొడ్లు అంతంతే
- సుదీర్ఘ సమీక్షలతో సరి.. ఫలితాలపై లేదు గురి



ఆంధ్రజ్యోతి పరిశీలన

జంగారెడ్డిగూడెం జడ్పీ బాలుర హైస్కూల్‌లో తుప్పు పట్టిన ఐరన్

మరో నాలుగు రోజుల్లో పాఠశాలలు తెరుచుకోనున్నాయి. స్కూల్ బెల్ మోగే నాటికి వాటిని సిద్ధం చేయాలి. కాని చాలా చోట్ల సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఉమ్మడి ఐదేళ్ల జగన్ జమానాలో నాడు-నేడు అంటూ నానా హడావుడి చేశారు. ఇప్పుడా పనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. తెలుగుదేశం ప్రభుత్వం విద్యావ్యవస్థ ప్రక్షాళనకు సిద్ధ పడింది. కానీ అనేక చోట్ల పాఠశాలల పరిస్థితి అత్యంత దారుణంగా ఉండగా, ఆ విషయాన్ని విస్మరించింది. పాఠశాలల్లో సమస్యలన్నింటిపైన 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలన నెరిపింది. ఈ విద్యా సంవత్సరంలో కూడా విద్యార్థులు ఎప్పటి మాదిరిగానే తిప్పలు పడక తప్పదా.. అనే పరిస్థితి కనిపిస్తోంది. ప్రభుత్వం ఏం చేస్తుందో చూడాల్సి వుంది.

లోపలి పేజీలో..

ఫీజులుం

ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీ

ఒకటో తరగతికే కనీస ఫీజు రూ.25 వేలు

తల్లిదండ్రులపై చదువుల భారం

అమ్మో జూన్

పెట్టుబడులు.. ఫీజులు

అడవిలో అటెన్షన్

ఆపరేషన్ కగార్‌తో అప్రమత్తం

- పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడుల్లో ప్రత్యేక పోలీస్ బలగాలతో గాలింపు
- ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు అటవీ ప్రాంతాల పర్యటనలకు వెళ్లవద్దని ఇంటెలిజెన్స్ ఆదేశాలు
- ప్రజలు భయపడాల్సిన పనిలేదు : ఎస్పీ కిశోర్



ఏలూరు క్రైం, జూన్ 7(ఆంధ్రజ్యోతి):కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేతకు జల్లెడ పట్టింది. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల జాడ గుర్తించి జల్లెడ పడుతున్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సమీపంలోని ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలోని మావోయిస్టులు ఎక్కువగా ఉన్నారు. వీరు మన రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని అటవీ ప్రాంతాలను, గిరిజన గ్రామాలను షెల్టర్‌జోన్లుగా వినియోగించుకుంటున్నారు. అందులో భాగంగా ఏలూరు జిల్లాను గతంలో షెల్టర్‌జోన్‌గా వినియోగించుకున్నారు. ఇటీవల వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర నిఘా విభాగాలు ప్రభుత్వాలకు పలు హెచ్చరికలు, సూచనలు చేశాయి. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు మారుమూల గిరిజన ప్రాంతాలు, అటవీ ప్రాంతాలవైపు వెళ్ళవద్దని అత్యవసర పరిస్థితుల్లో అయితే అదనపు బలగాలతోనే పర్యటనలు కొనసాగించుకోవాలని సూచించారు. దీంతో ఏలూరు జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలు, ఒక పార్లమెంటు నియోజకవర్గం ఉండడం ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో ఒక శాసనసభ స్థానం(పోలవరం) ఉండడంతో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అదనపు భద్రతను కల్పించి ఆయన ముందుగా తలపెట్టుకున్న ఏజెన్సీ ప్రాంతాల్లో పర్యటనలను రద్దు చేశారు. ఎక్కడా అభివృద్ధి పనులకు ఆలస్యం జరగకుండా స్థానిక కూటమి నాయకులే శంకుస్థాపనలు నిర్వహించుకోవాలని సూచనలు చేయడంతో ఈ విధంగా అభివృద్ధి పనులను చేస్తున్నారు. జిల్లాలో నక్సల్స్/మావోయిస్టుల కదలికలపై గతాన్ని పరిశీలిస్తే పోలవరం, బుట్టాయిగూడెం, కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి అటవీ ప్రాంతాలను గిరిజన (మిగతా 8వ పేజీలో)



వేలేరుపాడు మండలంలోని ఓ గిరిజన గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తున్న ప్రత్యేక సాయుధ దళాల పోలీసులు

వేలేరుపాడులో ఏం జరుగుతోంది ?

ఎమ్మెల్యే బాలరాజు పర్యటనలు రద్దు

వేలేరుపాడు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): విస్తృతమైన సాయుధ బలగాల గాలింపులతో వేలేరుపాడులో ఏం జరుగుతోంది ? అనే ప్రశ్న స్థానికులను ఆందోళన కలిగిస్తోంది. ఓ వైపు ఆపరేషన్ కగార్‌తో భారీ సంఖ్యలో మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లలో హతమవడంతో మిగిలిన వారు ఇటువైపు వస్తున్నారన్న అనుమానాలు లేకపోలేదు. చాలా ఏళ్ల తర్వాత మావోయిస్టుల కదలికలు ఈ ప్రాంతంలో ఉన్నట్లు పోలీస్ శాఖకు నిఘా వర్గాల ద్వారా తెలియడంతో మండలంలో పోలీసులు అప్రమత్తం అయ్యారు. ఆపరేషన్ కగార్‌తో పదుల సంఖ్యలో మావోయిస్టులు ప్రాణాలు కోల్పోవడంతో మావోయిస్టులు షెల్టర్‌జోన్‌గా వేలేరుపాడు మండలాన్ని ఎంచుకునే అవకాశాలు ఉన్నట్టు భావిస్తున్నారు. గతంలో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, రాష్ట్రాల్లో ఎన్‌కౌంటర్‌లు, కూంబింగ్‌లు జరిగిన సందర్భాల్లో మావోయిస్టులు ఈ మండలంలోని కోయిదా, కటుకూరు అటవీ ప్రాంతాల్లో తలదాచుకున్నట్టు ప్రచారం జరిగింది. అప్పట్లో పెద్దఎత్తున వారి ఆచూకీ కోసం భారీ ఎత్తున గ్రేహౌండ్స్ దళాలతో కూంబింగ్‌లు నిర్వహించారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు ఏమైనా వచ్చే (మిగతా 8వ పేజీలో)

రెవెన్యూలో బదిలీలు



ఏలూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి):జిల్లా రెవెన్యూ శాఖలో ఐదుగురు తహసీల్దార్లు, పలువురు డీటీలు, సీనియర్ అసిస్టెంట్లను బదిలీ చేస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు.

తహసీల్దార్లు

కొయ్యలగూడెం తహసీల్దార్ కె.చెల్లన్నదొరను కలెక్టర్ కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరిండెంటెంట్‌గా, ఏలూరు ల్యాండ్ ఎక్విజేషన్ స్పెషల్ తహసీల్దార్ జి.విజయకుమార్‌రాజును ఏలూరు రూరల్‌కు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ పి.రవికుమార్‌ను ఏలూరు ల్యాండ్ ఎక్విజేషన్ తహసీల్దార్‌గా, కలెక్టరేట్‌లో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న సూపరింటెండెంట్ ఎండీ నయిముల్లా షాను లింగపాలెం తహసీల్దార్‌గా, ఏలూరు అర్బన్ తహసీల్దార్ జీవీ శేషగిరిరావును కలెక్టరేట్ ల్యాండ్ మేటర్స్ తహసీల్దార్‌గా బదిలీ చేశారు.

డిప్యూటీ తహసీల్దార్లు

పోలవరం ప్రాజెక్టు యూనిట్-2 ఎస్‌డీటీ ఆర్.నాగలక్ష్మిని పెదపాడు డీటీగా, పెదపాడు డీటీ ఎ.ప్రమోద్‌కుమార్‌ను ఏలూరు ఎపిక్ డీటీగా, జీలుగుమిల్లి రీ సర్వే డీటీ ఎస్ రాధాకృష్ణను కొయ్యలగూడెం రీ సర్వే డీటీగా, కొయ్యలగూడెం రీసర్వే డీటీ వై.సుమర్ననను బుట్టాయగూడెం, కుక్కునూరు సీ రీ సర్వే డీటీ వీవీ పెదిరాజును జీలుగుమిల్లికి, ద్వారకాతిరుమల రీ సర్వే డీటీని పి.కామేశ్వరరావును భీమడోలుకు, భీమడోలు రీ సర్వే డీటీ కె.సాయికిరణ్‌ను ద్వారకాతిరుమల(డిప్యూటేషన్‌పై ఏలూరు ఆర్డీవో), ఏలూరు సీఎస్ డీటీ ఎం.ఉమామహేశ్వరరావును కైకలూరు డీటీగా బదిలీ చేశారు. కైకలూరు సీఎస్ డీటీ ఎండీ ఇబ్రహీంను ఏలూరుకు, ఏలూరు ఆర్డీవో కార్యాలయ ఎస్‌డీటీ ఎస్.పోతురాజును ఉంగుటూరు ఎపిక్ డీటీగా, ఉంగుటూరు ఎపిక్ డీటీ పి.నజిమా బేగంను ఏలూరు ఆర్డీవో కార్యాలయ ఎస్‌డీటీగా, పోలవరం డీటీ జి.రామ్‌నాథ్‌బాబును పోలవరం ప్రాజెక్టు యూనిట్-2 డీటీగా, ఏలూరు రూరల్ డీటీ ఎ.శ్రీనివాసరావును దెందులూరు డీటీగాను,దెందులూరు డీటీ ఏవీఆర్ ప్రియదర్శినిని ఏలూరు రూరల్ డీటీగా బదిలీ చేశారు.

సీనియర్ అసిస్టెంట్లు..

జంగారెడ్డిగూడెం సీనియర్ అసిస్టెంట్ ఎం.జ్యోతిని కుక్కునూరుకు, కుక్కునూరు సీనియర్ అసిస్టెంట్ ఎస్.వెంకటేశ్‌ను జంగారెడ్డిగూడేంకు, పెదపాడు సీనియర్ అసిస్టెంట్ పి.నయిమిని ఏలూరు కలెక్టరేట్‌కు, కలెక్టర్ సీనియర్ అసిస్టెంట్ బి.దుర్గారావును పెదపాడుకు, కొయ్యలగూడెం సీనియర్ అసిస్టెంట్ టి.నాగరాజును, ఏలూరు సివిల్ సప్లయ్స్‌కు, జీలుగుమిల్లి ఆర్ఐ జి.జ్యోతిలక్ష్మిని కొయ్యలగూడెంకు, ఏలూరు కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ కేఎస్ఎల్ నారాయణను ఉంగుటూరుకు, ఉంగుటూరు సీనియర్ అసిస్టెంట్ డి.డేవిడ్‌రాజును దెందులూరుకు, ఏలూరు కలెక్టర్ సీనియర్ అసిస్టెంట్ ఎస్ఎస్ సత్యకృష్ణవేణిని ఏలూరు రూరల్‌కు, ఏలూరు రూరల్ సీనియర్ అసిస్టెంట్ డి.మోషెను దెందులూరుకు, నూజివీడు సబ్‌కలెక్టరేట్ సీనియర్ అసిస్టెంట్ ఎ.దీపికను చాట్రాయికి, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టరేట్‌లోని సీనియర్ అసిస్టెంట్ పి.శిరీషాను ఏలూరు కలెక్టరేట్‌కు, కుక్కునూరు ఆర్ఐ జె.వెంకటేశును పశ్చిమగోదావరి జిల్లాకు కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు.

సెకండియర్ సప్లిమెంటరీలో..

60 శాతం ఉత్తీర్ణత

- రెగ్యులర్ పరీక్షల ఫలితాలకు సప్లిమెంటరీ రిజల్ట్స్‌ను జోడిస్తే 97 శాతం ఉత్తీర్ణత

ఏలూరు అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో జిల్లాకు 60 శాతం ఉత్తీర్ణత లభించింది. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు జనరల్ విభాగంలో 2,423 మంది విద్యార్థులకు 2,261 మంది పరీక్షలకు హాజరుకాగా 1,350 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో 534 మంది విద్యార్థులకు పరీక్షలు రాసిన 461 మందిలో 273 మంది ఉత్తీర్ణుల య్యారు. మొత్తంమీద 1,099 మంది ఫెయిల య్యారు. ఇక ప్రథమ సంవత్సరం పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విభాగాల్లో మొత్తం 4,823 మంది విద్యార్థులకు 4,545 మంది పరీక్షలు రాశారు. వీరిలో 2,146 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 1,099 మంది ఫెయిలయ్యారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణుల్లో బాలురు 1,937 మంది (50 శాతం), బాలికలు 1,832 మంది (55 శాతం) ఉన్నారు. కాగా తాజాగా వెలువడిన సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను, ఈ ఏడాది మార్చిలో జరిగిన రెగ్యులర్ పరీక్షల ఫలితాలను కలిపితే ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 13,508 మంది హాజరుకాగా వీరిలో 13,055 మంది (97శాతం) ఉత్తీర్ణత సాధించినట్టయింది. ఇదేరీతిలో ప్రథమ సంవత్సరం పరీక్షల ఫలితాలను జోడిస్తే మొత్తం 17,168 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 14,238 మంది (83శాతం) ఉత్తీర్ణులయ్యారు.

- జవాబు పత్రాల రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం ఈ నెల 9నుంచి 13 వరకు గడువు ఉందని ఆర్ఐవో యోహాన్ తెలిపారు. దరఖాస్తు రుసుంగా రీవెరిఫికేషన్‌కు సబ్జెక్టుకు రూ.1300, రీకౌంటింగ్‌కు రూ.260 చొప్పున విద్యార్థులు తాము చదివిన కళాశాలల నుంచే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్యార్థులు

ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఉత్తీర్ణతలో ప్రైవేటు జూనియర్ కళాశాలలతో అన్ని ప్రభుత్వ యాజమాన్యాల జూనియర్ కళాశాలల విద్యార్థులు పోటీపడ్డారు. జిల్లాలోని 80 ప్రైవేటు జూనియర్ కళాశాలల నుంచి రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు 24,957 మంది హాజరుకాగా 22,545 మంది (90 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో ఈ ఏడాది ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసిన మొత్తం 102 మందీ పాస్‌తో జిల్లాలోని 3 కేజీబీవీలు వందశాతం స్ట్రైక్‌రేట్‌ను సాధించాయి. తదుపరి 917 మంది (99 శాతం) ఉత్తీర్ణతతో ఏపీ సోషల్ వెల్ఫేర్, 2,423 మంది ఉత్తీర్ణత (84శాతం)తో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 499 మంది (84శాతం) పాస్‌తో ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలు, 151మంది (76శాతం) ఉత్తీ ర్ణతతో ఎయిడెడ్ కళాశాలలు, 241మంది (58 శాతం) ఉత్తీర్ణులతో చివరి స్థానంలో హైస్కూల్ ప్లస్‌లు నిలిచాయి.

మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం : కలెక్టర్

ఏలూరు టూటౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. నాషా ముక్త్ భారత్ అభియాన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం ఆశ్రం మెడికల్ కళాశాలలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఫ్రెండ్లీ మ్యాచ్‌లో కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప్ శివకుమార్ పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారాన్ని 1972, 14446టోల్‌ఫ్రీ నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ రామ్‌కుమార్, డీఎస్‌డీవో శ్రీనివాసరావు, సెట్‌వెల్ సీఈవో ప్రభాకర్, ఎన్‌జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



క్రికెట్ ఆడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

బీసీ సంక్షేమాధికారి ఆర్‌వీ నాగరాణి, డీఎస్‌వో శివరామమూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ త్రినాథ్‌బాబు, మైక్రో ఇరిగేషన్ పీడీ రవికుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలు

ఏలూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాను అభివృద్ధి పథంలో నిలిపేలా జిల్లా, నియోజక వర్గాల అభివృద్ధిపై కార్యా చరణ ప్రణాళికలను సమర్పించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. జల వనరుల శాఖ ఎస్ఈ నాగార్జునరావు, కమిషనర్ భాను ప్రతాప్, డీసీవో అరిమిల్లి శ్రీనివాస్, డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి,

9న యోగాంధ్రపై ర్యాలీ

కలెక్టరేట్‌లో శనివారం యోగాంధ్రపై కలెక్టర్ సమీక్షించారు. 9న యోగాంధ్రపై ఏలూరులో ర్యాలీ, 13న జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమం, 10న జంగారెడ్డిగూడెంలో మద్ది ఆంజనేయస్వామి గుడి వద్ద, 18న జీలకర్రగూడెంలోని గుంటుపల్లి గుహల వద్ద యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. 13న ఏలూరులోని సర్ సీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో జరిగే జిల్లా స్థాయి యోగాసన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు హాజరవుతారన్నారు.

గ్రామ సచివాలయాల్లో 10 వరకు ఆన్‌లైన్ సేవలు బంద్

ముదినేపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ నెల 10వ తేదీ వరకు అన్ని రకాల ఆన్‌లైన్ సేవలు బంద్ కానున్నాయి. మైక్రో సాఫ్ట్ క్లౌడ్ నుంచి ఏపీ సేవ పోర్టల్‌ను రాష్ట్ర డేటా సెంటర్‌కు తరలిస్తున్నందున ఈ అంతరాయం కలగనుంది. మీ సేవ కేంద్రాల్లో కొన్ని రకాల సేవలు నిలిచిపోతాయి. ఆదాయ ధ్రువీకరణ, సమగ్ర ధ్రువీకరణ, భూమి మ్యూటేషన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు, వృద్ధాప్య ధ్రువీకరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, రెవెన్యూ, నీటితీరువా, పట్టణ పరిపాలన సంబంధిత సేవలు, మత్స్య శాఖకు సంబంధించిన సేవలు మీ సేవ కేంద్రాల్లో నిలిచిపోతాయి.

రేపు టెన్త్, ఇంటర్ టాపర్లకు షైనింగ్ స్టార్స్ పురస్కారాలు

ఏలూరు అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి, కళాశాలల్లో ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన బాలబాలికలను షైనింగ్ స్టార్స్ పురస్కారాలతో సత్కరించనున్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. ఈనెల 9న ఉదయం 9.30 గంటల నుంచి ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో పురస్కారాల అందజేత కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. జిల్లాలో టెన్త్ ఫలితాల్లో 83.33 శాతం, అంతకుమించి మార్కులు సాధించిన విద్యార్థులను మండలానికి ఆరుగురు చొప్పున మొత్తం 163 మందిని పురస్కారాలకు ఎంపిక చేశామన్నారు. ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుంచి అత్యుత్తమ మార్కులు సాధించిన 34 మంది విద్యార్థులను ఎంపిక చేశామని వివరించారు. పురస్కారంగా సర్టిఫికెట్, రూ.20 వేలు నగదు అందజేస్తామన్నారు. కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. పురస్కారాల అందజేత కార్యక్రమంపై శుక్రవారం ఏలూరు కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షకు డీఈవో వెంకటలక్ష్మమ్మ, సమగ్రశిక్ష ఏపీసీ పంకజ్‌కుమార్, ఇరిగేషన్ నాగార్జునరావు పాల్గొన్నారు.



శ్రీవారి క్షేత్రం .. భక్త జనసంద్రం

లోపలి పేజీలో..

సర్కారు బడుల్లో చేరే పిల్లలందరికి దాదాపు అన్నీ ఉచితమే. స్కూల్ యూనిఫాం, టై, బ్యాగు, బూట్లతో పాటు ..మధ్యాహ్న భోజనం కూడా.. రూపాయి ఫీజు చెల్లించనక్కర్లేదు. కానీ వేలకు వేలు దోపిడీ చేసే కార్పొరేట్ స్కూళ్లవైపే అందరూ చూస్తున్నారు. దీనికి విరుగుడుగా ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలను సమకూర్చాలని ఇంతకు ముందే భావించారు. ఉమ్మడి జిల్లాలో 2700కు పైగా పాఠశాలలకు తాగునీరే కాకుండా, ప్రహరీతో పాటు చక్కటి తరగతి గదులు, రంగులతో తీర్చిదిద్దారు. ఐదేళ్ల జగన్ జమానాలో నాడు-నేడు అంటూ నానా హడావుడి చేశారు. కానీ ఆ పనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పాఠశాలలు మరికొద్ది రోజుల్లోనే తెరవనున్నారు. అధికారం లోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం విద్యావ్యవస్థ ప్రక్షాళనకు సిద్ధపడింది. కానీ అనేకచోట్ల పాఠశాలల పరిస్థితి అత్యంత దారుణంగా ఉన్నాయి. ఎక్కడికక్కడ నిర్మాణాలు పిల్లర్ల స్థాయిలోనే నిలిచి కనిపిస్తున్నాయి. అదనపు తరగతి గదులు మూలన పడి వెక్కిరిస్తున్నాయి. రెండో విడతగా నాడు-నేడు పనులకు సరైన నిధులు సమకూర్చినా పరిస్థితుల్లో మార్పు రాలేదు. కనీసం గడిచిన రెండు నెలల్లో పనులు పూర్తిచేస్తే మధ్యలో నిలిచిన అదనపు తరగతి గదులు అందు బాటులోకి వచ్చి ఉండేవి. వీటన్నింటిపైన 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలన చేయగా అక్కడక్కడ వైఫల్యాల జాడే కనిపించింది. ముందు చూపు కొరవడి ఈ విద్యా సంవత్సరంలో కూడా విద్యార్థులు ఎప్పుడు మాదిరిగానే తిప్పలు పడక తప్పదా..? లేకుంటే ఇప్పటికైనా స్పందించి పనులు పూర్తి చేస్తారా..?

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



జంగారెడ్డిగూడెం జడ్పీ బాలుర హైస్కూల్‌లో అసంపూర్తిగా నిలిచిన అదనపు తరగతి గదుల భవనం

బడి గంటలు మోగే వేళ..

సర్కారు బడుల్లో సమస్యలెన్నో

- ఎక్కడికక్కడ నిలిచిన నాడు-నేడు పనులు
- అదనపు తరగతి గదులు చాలాచోట్ల లేనట్లే
- ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణాలు ఎక్కడికక్కడే..

'ఆంధ్రజ్యోతి' పరిశీలన



కొమరవరంలో పై స్లాబు లేని మండల పరిషత్ పాఠశాల భవనం

అసంపూర్తి నిర్మాణాలతో అవస్థలు

తణుకు రూరల్ : తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో నాడు-నేడు రెండో విడతలో చేపట్టిన పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. నాలుగు పాఠశాలల్లో నాడు నేడు పనులు చేపట్టగా అవి నేటికీ పూర్తికాలేదు. వచ్చే విద్యా సంవత్సరంలో కూడా విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు. మండలంలోని కొమరవరం, 2వ ప్రాథమిక పాఠశాల, ముద్దాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతుల నిర్మాణాలకు సంబంధించిన భవనాల స్లాబులు వేయలేదు. సిమెంట్ తప్ప సామాగ్రి అంతా సిద్ధంగా వున్నా పనులు పూర్తి కావడం లేదంటున్నారు. కొన్ని భవనాలు పూర్తి చేసినా ఇంకా రంగులు వేయక పోవడంతో అందుబాటులోకి రాలేదంటున్నారు.



పెంటపాడు పోస్టుబేసిక్ ప్రాథమిక పాఠశాలలో సగం లోనే నిలిచిన అదనపు తరగతి పనులు

సగంలోనే నిలిచిన నాడు-నేడు పనులు

పెంటపాడు : మండలంలో ప్రభుత్వ పాఠశాలలు వసతుల లేమితో కొట్టాడుతున్నాయి. గత ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడులో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు చాలావరకు సగంలోనే నిలిచిపోయాయి. మండలంలో 55 ప్రాథమిక పాఠశాలలు,13 ఉన్నత పాఠశాలలో మొత్తం 68 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పడమర విప్పర్రులోని సుక్కాల దిబ్బ, పోస్టుబేసిక్, బిళ్ళగుంట, మీనవల్లూరు, రావిపాడు-2 ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతుల నిర్మాణం నిధుల లేమితో మధ్యలోనే నిలిచిపోయాయి. ఇక పడమర విప్పర్రు జడ్పీ, ప్రత్తిపాడు-2, బిళ్ళగుంట, బీ.కొండేపాడు-2, రావిపాడు-2 పాఠశాలలో కాంపౌండ్ వాల్ నిర్మాణాలు సగంలోనే నిలిచి పోయాయి. పడమరవిప్పర్రులోని ఆది ఆంధ్ర, వడ్డిగూడెం, ముదునూరులోని బీజీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో వర్షాలు వస్తే స్లాబ్ లీకై విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.



ఆచంట మండలం కొడమంచిలి శివారు తురకవాని మెరకలో అసంపూర్తిగా నిలిచిన పాఠశాల భవనం



మెరక చేయని బేతపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణ

బేతపూడిలో వర్షం వస్తే అవస్థలు

భీమవరం రూరల్ : భీమవరం మండలం బేతపూడి గ్రామంలోని జడ్పీ హైస్కూల్ పాఠశాల భవనాలు పల్లపు ప్రాంతంలో ఉండటంతో వర్షాకాలంలో వర్షపు నీరు చుట్టూ నిలిచిపోవడంతో విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది. గతంలో నాడు-నేడు సెకండ్ ఫేజ్‌లో పాఠశాల అభివృద్ధి పనులు చేశారు. అయినా పాఠశాల బయట ప్రాంగణం పూడిక చేయలేదు. గడిచిన విద్యా సంవత్సరంలో విద్యార్థులు వర్షాకాలమంతా నానా ఇబ్బందులు పడ్డారు. అధికారులు దృష్టి పెడితే ఈ ఏడాదైనా ఇబ్బందులు తప్పుతాయి.

ఆచంటలో అసంపూర్తి భవనాలు

ఆచంట : ఆచంట మండలంలో గత ప్రభుత్వంలో నాడు- నేడు ఫేజ్-1, ఫేజ్-2 కింద అదనపు తరగతులు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అయితే ఫేజ్-2లో కొడమంచిలి శివారు తురకవాని మెరకలో అదనపు తరగతుల భవన నిర్మాణ పనులు, కోడేరులో హైస్కూలుకు సంబంధించి పనులు నిలిచిపోయాయి. పెనుమంచిలి మెయిన్, పుచ్చల్లంకలో ప్రాథమిక పాఠశాలలో స్లాబ్ లీకేజీ అవుతుండగా వల్లూరు శివారు శీలంవారి పాలెంలో ఉన్న పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది.

మధ్యలో నిలిచిన నిర్మాణాలు

నరసాపురం రూరల్ : మరో వారం రోజుల్లో ప్రభుత్వ స్కూళ్ల పునర్ ప్రారంభం కానున్నాయి. పట్టణంలోని పార్కు రోడ్ లోని హైస్కూల్, లెనిన్ స్కూల్, బాలిక పాఠశాల్లో అదనపు తరగతులు, పెయింట్స్ ప్రహరీ గోడలు నిర్మించాల్సి ఉంది. ఇక మండలంలోని మల్లవరం, చిట్టవరం, తూర్పుతాళ్ళు గ్రామాల్లోని హైస్కూళ్లలో అదనపు తరగతులు నిర్మించాల్సి ఉంది. పీఎం లంక, సారవ, ఎల్‌బిచర్ల, వైఎస్‌పాలెం స్కూళ్లలో పెయింటింగ్స్, రిపేర్లు, వైరింగ్ వంటి పెండింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. అదనపు తరగతులు పూర్తికాకపోవడంతో చాలీచాలని గదుల్లో లేదా వరాండాల్లోనే విద్యార్థులు చదువు కోవాల్సిన పరిస్థితి నెలకొందన్న వాదనలు విద్యార్థుల తల్లితండ్రుల నుంచి వినిపిస్తున్నాయి.

రెండో దశ పనులకు ప్రభుత్వం నిధులు

ఏలూరు అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ బడులను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేస్తామంటూ ఆర్భాటాలు చేసిన జగన్ ప్రభుత్వం పలు పనులను అర్ధంతరంగా నిలిపివేయడంతో ఏలూరు జిల్లాలో 847 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలల్లో ఏడాదికాలంగా విద్యార్థులు ఎదుర్కొంటోన్న సమస్యలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరి స్తోంది. వైసీపీ ప్రభుత్వంలో నిలిచిపోయిన 137 పాఠశాలల టాయిలెట్లు, 53 కిచెన్‌షెడ్లు, 182 పాఠశాలలకు మేజర్, మైనర్ రిపేర్లు, 37 పాఠశాలలకు విద్యుదీకరణ పనులు, 190 పాఠశాలలకు ప్రహరీ గోడలు, 226 పాఠశాలలకు అదనపు తరగతి గదులు, 4 పాఠశాలల ప్రాంగణాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు భవన నిర్మాణాలు కలిపి మొత్తం 829 పనులను పూర్తిచేయనున్నారు. నూతన విద్యాసంవత్సరం నుంచి జిల్లాలో ప్రారంభించనున్న 347 మోడల్ ప్రైమరీ స్కూళ్లకు కూటమి ప్రభుత్వం అన్నిరకాల హంగులను సమకూర్చనుంది. ఇందులోభాగంగా ఆయా మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ప్రస్తుతం వున్న సౌకర్యాలు, ఇంకా కావాల్సిన వసతులపై శుక్రవారం నుంచి అన్ని మండలాల్లో సర్వే ప్రారంభించారు. వీటిలో సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ కింద రూ.3.95 కోట్లను విడుదల చేశారు. మొత్తంమీద జిల్లాలో నిలిచి పోయిన రెండోదశ పనులను కూటమి ప్రభుత్వం మన బడి -మన భవిష్యత్తు పథకం పేరిట గత ఆర్థిక సంవత్సరంలో రూ.109.89 కోట్ల నిధులను విడుదల చేయగా వీటిలో ఇంతవరకు రూ.99.69 కోట్లను ఖర్చుచేసి ఆయా పనులను పూర్తిచేశారు.

ఆకివీడులో అసంపూర్తి పనులు



నిలిచిన జడ్పీ పాఠశాల పనులు

ఆకివీడు : ఆకివీడు రెండవ వార్డు జానకీనగర్‌లో ఎంపీపీ పాఠశాల పిల్లర్స్, స్లాబ్ శిథిలావస్థకు చేరాయి. సిద్ధాపురం రోడ్‌లోని ఎంపీపీ పాఠశాల ఫ్లోరింగ్ వర్షం వస్తే నీటమునుగుతోంది. ఒకటో వార్డులో పాఠశాల నిర్వహణకు తరగతి గదులు లేకపోవడంతో జిల్లా పరిషత్ బాలురున్నత పాఠశాలలోని ఒక తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. జిల్లా పరిషత్ బాలురున్నత పాఠశాలలో నాడు-నేడు ద్వారా 12 గదుల నిర్మాణానికి మంజూరు కాగా వచ్చిన నిధులతో ఆరు రూమ్‌లు నిర్మాణం చేశారు. మరో ఆరు రూమ్‌లకు సంబంధించి ఫ్లోర్ వరకే నిర్మాణం జరిగింది.

కూలిన ప్రహరీ గోడలు

ముసునూరు : ముసునూరు మండలం వేల్పుచర్ల మెయిన్ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. చెక్కపల్లి జడ్పీ పాఠశాలలో ప్రహరీ గోడ రెండు చోట్ల కూలిపోయి ఉంది. ఫేజ్-2 నాడు-నేడులో ప్రారంభించిన అదనపు తరగతి గదుల భవనాలు చెక్కపల్లి, రమణక్కపేట జడ్పీ హైస్కూల్స్‌లో పూనాది దశలో అసంపూర్తిగా ఉన్నాయి. గురుకుల బాలికల పాఠశాల, సూరేపల్లి, రమణక్కపేట, వేల్పుచర్ల గ్రామాల్లో ఉన్న పాఠశాలల చుట్టూ ప్రహరీ సౌకర్యం లేదు.

నిధులున్నా కదలని పనులు

జంగారెడ్డిగూడెం: మండలంలో ఫేజ్-2 నాడు-నేడు పనుల్లో భాగంగా 55 పాఠశాలలకు గాను 355 పనులు మంజూరయ్యాయి.వీటి కోసం రూ.20.74 కోట్ల నిధులు మంజూరు చేశారు. వీటిలో కేవలం రూ.11 కోట్ల 80 లక్షల విలువైన పనులు మాత్రమే పూర్తయ్యాయి. మండలంలోని అనేక పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పనులు పూర్తిగా నిలిచిపోయాయి. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 18 అదనపు తరగతి గదుల నిమిత్తం రూ.2.35 కోట్లు నిధులు మంజూరు చేశారు. జీప్లస్ టూ భవనం నిర్మించాల్సి ఉండగా కేవలం గ్రౌండ్ ఫ్లోర్ నిర్మించి ఆరు గదులు మాత్రమే పూర్తి చేశారు. భవన ప్రాంగణమంతా పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నది. మండలంలోని వేగవరం గ్రామంలో రెండేళ్ల క్రితం వచ్చిన వర్షాలకు జడ్పీ హైస్కూల్ ప్రహరీ గోడ కూలిపోగా ఇప్పటివరకూ దాన్ని నిర్మించలేదు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికైనా మండలంలో నిలిచిపోయిన నాడునేడు పనులు పూర్తిచేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

చింతలపూడిలో ఇంకా సమస్యలే..

చింతలపూడి : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంకా అరకొర సౌకర్యాలతోనే ఇబ్బందులు పడుతున్నారు. నాడు-నేడు పథకంలో మొదటి, రెండవ ఫేజ్‌ల్లో మండలంలోని 59 పాఠశాలల్లో పథకం ప్రారంభించారు. ఇందులో 52 పాఠశాలల పనులు ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి. కేవలం ఏడు మాత్రమే పూర్తయ్యాయి. వీటికి ప్రస్తుతం పది శాతం నిధులు కేటాయిస్తే ఈ నిర్మాణంలో నిలిచిన భవనాలు నిర్మాణం పూర్తవుతాయి. మండలంలో 96 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. లింగగూడెం, సుప్రియన్ పేట, గురుభట్లగూడెం, యండపల్లిలోని సీఎస్ఐ, ఆర్‌సీఎం, మిషనరీ పాఠ శాలలను ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేశారు. వీటికి సరైన సౌకర్యాలు లేవు. కొన్నింటికి ప్రహరీగోడలు కూడా లేవు. ఆంథోనినగర్‌లోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులు తక్కువ. వర్షాకాలం వస్తే పాఠశాల చుట్టూ వర్షపునీరు నిలుస్తుంది. లోపలికి వెళ్ళడానికి విద్యార్థులకు ఇబ్బందులు. అదేవిధంగా జార్జిపేట పాఠశాలను రద్దు చేసి తిరిగి ప్రారంభించారు. ఈ పాఠశాలలో కూడా మంచినీటి సమస్యలు ఉన్నాయి. చింతలపూడిలోని మేడబడి వంద సంవత్సరాల క్రితం నిర్మించారు. ఇప్పటికీ ఇది స్ట్రాంగ్‌గా ఉందని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. దీనిని పగడగొట్టి కొత్తది నిర్మించాలని గతంలోనే నిర్ణయించారు. కాని ఇవి పడగొట్టకుండానే కొత్త భవనాలు నిర్మించి వాటిలో తరగతులు నిర్వహిస్తున్నారు. దీనిని కూడా మరమ్మతులు చేస్తే అదనపు సౌకర్యం కలుగుతుంది.



కాంపౌండ్ లేని చింతలపూడి సుప్రియన్‌పేట పాఠశాల



జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్ఏ నాయకులు

ఫీజుల దోపిడీ అరికట్టాలి

భీమవరం రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో విచ్చలవిడి ఫీజుల దోపిడీని అరికట్టాలని, విద్యా వ్యాపారాన్ని నియంత్రించాలని, ప్రభుత్వం జారీ చేసిన జీవోలు ప్రకారమే విద్యార్థుల వద్ద నుంచి ఫీజులు వసూలు చేయాలని, ఈ విద్యా సంస్థల్లో 25 శాతం సీట్లు బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఇచ్చేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. శనివారం పశ్చిమ గోదావరి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) సీసీ వృత్తికి భీమవరం కార్యాలయంలో వినతిపత్రం అందించారు. జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి మాట్లాడుతూ మన జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో అడ్డూ అదుపు లేకుండా విచ్చలవిడిగా ఫీజులు సంబంధిత యాజమాన్యాలు వసూలు చేస్తున్నాయని, వీటిపై విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 42 ప్రకారం ఎల్‌కేజీ నుంచి ఏడవ తరగతి వరకు గ్రామీణ ప్రాంతాల్లో రూ. 7800, పట్టణ ప్రాంతాల్లో రూ. 9వేల లోపు వసూలు చేయాలని, 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు రూ.12 వేలలోపు మాత్రమే ఫీజులు వసూలు చేయాలని, అంతకంటే ఎక్కువ ఫీజులు వసూలు చేయాలంటే పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఆమోదం తర్వాత, జిల్లా ఫీజుల నియంత్రణ కమిటీ ఆమోదించాలని, విద్యా హక్కు చట్టం చెబుతుంటే దీనికి భిన్నంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తుంటే విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఈ విద్యా సంస్థల్లో 25 శాతం సీట్లు బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలని, ఈ నిబంధనలను కూడా జిల్లాలో కొన్ని విద్యా సంస్థలు పాటించడం లేదని ధ్వజమెత్తారు. రానున్న రోజుల్లో ఈ ఫీజుల దోపిడీపై వివిధ పద్ధతుల్లో ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఏఐఎస్ఏ నాయకులు పుల్లారి రాంప్రసాద్, ఎం.రాజు పాల్గొన్నారు.

ఫీజులుం

ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీ

- ఒకటో తరగతికే కనీసం రూ.25 వేల ఫీజు
- తల్లిదండ్రులపై చదువుల భారం
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- నామమాత్రంగా పేరెంట్స్ కమిటీ తీర్మానాలు

చదువుకునే రోజులు పోయి చదువు "కొనే" రోజులు వచ్చాయి. బడి తలుపులు తీస్తున్న వేళ ఫీజుల టెన్షన్ మొదలైంది. ప్రైవేటు స్కూళ్ళు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో లక్షలాది రూపాయలు చెల్లించ లేక తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు. తమ పిల్లల భవిష్యత్తే తమ భవిష్యత్తుగా భావించి అప్పులు చేసి మరీ పిల్లలను చది విస్తున్నారు. జూన్ నెల వచ్చిందంటే చాలు తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. తాడేపల్లిగూడేనికి చెందిన ఓ కార్పొరేట్ స్కూల్లో 10వ తరగతికి హాస్టల్‌తో కలిపి 1.50 లక్షలు పైనే ఫీజు చెల్లించాలని చెప్పడంతో పేరెంట్స్ బెంబే లెత్తిపోతున్నారు. కనీసం ఫీజులు వాయిదా రూపంలో చెల్లించడానికి కూడా ససేమిరా అంటుంటే పరిస్థితి ఎంత దారణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎటువంటి కనికరం లేకుండా ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు.

నిడమర్రు (ఆంధ్రజ్యోతి)

అడ్డగోలుగా ఫీజులు

గత సంవత్సరం 4వ తరగతి చదివే పిల్లవాడికి ఓ కార్పరేట్ స్కూల్‌లో బుక్స్ ఫీజు రూ.4 వేలు అయితే నేడు అదేపిల్లవాడికి 5వ తరగతి బుక్స్ ఫీజు రూ.10 వేలు చెప్పడంతో తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు. 5వ తరగతి పిల్లవాడికి 10 వేల ఖరీదైన బుక్స్ ఏముంటాయని ప్రశ్ని స్తున్నారు. ప్రతి సంవత్సరం ఇలా ఫీజులు ఇష్టారాజ్యంగా పెంచుకొంటూపోతే ఎలా చదివించుకోవాలని ఓ మధ్య తరగతి కుటుంబం ఆవేదన చెందుతోంది.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రైమరీ, యూపీ స్కూల్స్ సుమారుగా 550 ఉండగా హైస్కూల్స్ 490 ఉన్నాయి. అలాగే ప్రైవేటు స్కూల్స్ 1040 ఉండగా 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు సుమారు 5 లక్షల 47 వేల మంది ఉన్నారు.

నామమాత్రంగా పేరెంట్స్ కమిటీలు

రోజురోజుకూ పెరుగుతున్న చదువు భారం తగ్గించేందుకు గత ప్రభుత్వం కొంత ప్రయత్నం చేసి పేరెంట్స్ కమిటీ సభ్యులతో చర్చించి ఆరోగ్యకరమైన, హర్షనీయమైన ఫీజులు విధానం ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రయత్నిస్తే సఫలం కాలేదు. ప్రైవేటు స్కూల్స్ యజమాన్యాలు ప్రభుత్వ చర్యలు అమలు చేయనీయలేదు. నానాటికి పెరుగుతున్న ఫీజులు భారం మోయలేక దిక్కుతోచక తల్లిదండ్రులు కొట్టుమిట్టాడు తున్నారు. అధిక ఫీజులు చెల్లించి మరీ ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో చేర్పించి అప్పుల పాలవుతున్నారు.



నూతన ప్రభుత్వ హయాంలోనైనా తగ్గేనా ?

గత ప్రభుత్వ హయాంలో తగ్గింపు లేని ప్రైవేటు స్కూల్స్ ఫీజుల భారం నేడు కొత్తగా ఏర్పాటవుతున్న ప్రభుత్వం హయాంలోనైనా తగ్గుతాయని కొండంత ఆశతో పేరెంట్స్ ఎదరుచూస్తున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని ఫీజుల భారం తగ్గేలా చర్యలు తీసుకోవాలని పేరెంట్స్ కోరుతున్నారు.

• ప్రతీ ఏడాది లక్షల్లో ఖర్చు



పిల్లల చదువు కోసం ప్రతి సంవత్సరం లక్షల్లో ఖర్చువుతోంది. పిల్లలకు మంచి చదువు ఇవ్వాలనే ఉద్దేశంతో చదివిస్తున్నాం. కానీ స్కూల్స్‌లో ఫీజులు దారుణంగా ఉన్నాయి. మా అబ్బాయి భీమవరంలో కార్పొరేట్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. ఫీజు అక్షరాలా లక్ష రూపాయలు. ఫీజుల నిర్ణయంలో పేరెంట్స్‌కు భాగస్వామ్యం కల్పించాలి.

-సంకు రామకృష్ణ , పేరెంట్, భువ్వనపల్లి

• సమాచారమిస్తే చర్యలు



అధిక ఫీజుల వసూలు చేస్తే కఠినచర్యలు తీసుకొంటాం. ప్రైవేటు స్కూల్స్ యజమాన్యాలతో ఎప్పటికప్పుడు చర్చలు జరిపి అందరికీ ఆమోదయోగ్యమైన ఫీజులు నిర్ణయించా లని సూచనలు చేస్తున్నాం. ఎక్కడైనా అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లయితే ఫిర్యాదు చేస్తే తక్షణం చర్యలు తీసుకుంటాం ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థుల కోసం ఎన్నో సౌకర్యాలు కల్పిస్తోంది. నాణ్యతోకూడిన విద్యా సామాగ్రి, ఉచిత భోజన సదుపాయంతో పాటు క్వాలిఫైడ్ టీచర్స్‌తో బోధన జరుగుతోంది.

- పి.నారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి, పశ్చిమ గోదావరి జిల్లా

అమ్మో.. జూన్ నెల..!

- పేద వర్గాల్లో భయం..భయం
- పెట్టుబడుల వేళ రైతులకు ఫీజుల మోత



పాలకొల్లు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జూన్ నెల అంటే సామాన్య, మధ్య తరగతి ప్రజలు హడలిపోయే పరిస్థితి. పాఠశాలలు పునఃప్రారంభంతో తమ పిల్లల ఫీజులకై సొమ్ముల సేకరణలో ఇబ్బందులు. మరో వైపు రైతులు వ్యవసాయ పెట్టుబడులకు వెతుక్కునే పరిస్థితి. జూన్ నెల ఆరంభం అయ్యిందంటే సామాన్య, మధ్య తరగతి, వ్యవసాయ కుటుంబాలలో ఆనందం కంటే ఆందోళనే ఎక్కువగా కనిపిస్తోంది. సాధారణంగా జూన్ నెల ఆరంభం నుంచి పాఠశాలలు ప్రారంభమవుతాయి. తమ పిల్లలకు మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో అప్పులు చేసి మరీ ప్రవేటు పాఠశాలల్లో చదివిస్తున్నారు. దీంతో చిన్నతరహా ప్రవేటు పాఠశాలల నుంచి కార్పోరేట్ స్థాయి స్కూళ్ల వరకూ ఫీజులు ఎడా పెడా బాదేస్తున్నాయి. పూర్వ పశ్చిమగోదావరి జిల్లాలో ప్రైవేటు పాఠశాలల్లో ఎల్‌కేజీ స్థాయి నుంచి ఫీజులు కనిష్ఠంగా రూ.25 వేలు ఉండగా గరిష్ఠంగా రూ. లక్ష వరకూ ఉంది. ఫీజులు కాకుండా యూనిఫాం, పుస్తకాలు, ట్రాన్స్ పోర్టు, షూలు, బెల్ట్, ఇలా అన్ని విధాలుగానూ సొమ్ములు లాగేస్తుండటంతో పేద కుటుంబాలలోని పిల్లలకు విద్య భారంగా మారింది. రైతులు ఏరువాకకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే మెట్ట ప్రాంతాల్లో రైతులు నారు మడులు వేయగా, డెల్టాలో మెట్ట దుక్కులు చేస్తున్నారు. పెట్టుబడి సమీకరణకు ఇబ్బందులు పడుతున్నారు. విత్తనాల సేకరణ దగ్గర నుండి పంట చేతికి వచ్చేసరికి ఖరీఫ్ సీజన్‌లో ఎకరానికి రూ.30 వేలు, రబీలో రూ.40 వేలు ఖర్చు అవుతోంది. ఇదే సమయంలో ఫీజుల భారం తోడవడంతో ఏం చేయాలో తెలియన పరిస్థితిలో రైతులు ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినందున ఈ విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం పథకంలో ప్రభుత్వం ప్రకటించిన విధంగా అర్హులైన విద్యార్థులకు సొమ్ములు సకాలంలో అందజేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

దివ్యాంగుల పునరావాస కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నరసాపురం ఆర్డీవో దాసి రాజు

పాలకొల్లు అర్బన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక అంజలి మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాల ఆధ్వర్యంలో జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని నరసాపురం ఆర్డీవో దాసి రాజు శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, సంస్థ చైర్మన్ డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జీ) అధ్యక్షత వహించారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం అధికారిక కార్యాలయాన్ని డాక్టర్ బాబ్జీ ప్రారంభించారు. అనంతరం స్థానిక అమ్మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంజలి సంస్థకు, పాలకొల్లు పరిసర ప్రాంతాల్లోని ప్రత్యేకావసరాలు కలిగిన వారికి అందిస్తున్న సేవలను గుర్తించి సంస్థ చైర్మన్ అంబటి సాయి తేజను, కమిటీ సభ్యుడు అనంతపల్లి సురేష్‌ను ఆర్డీవో దాసి రాజు, డాక్టర్ బాబ్జీలు సత్కరించారు. ఎంఈవో-1 గంగాధర శర్మ, అడ్డాల వాసు, పప్పుల దుర్గేష్ అంజలి కార్యదర్శి వీడీవీ ప్రసాదరావు పాల్గొన్నారు.

చిన్ననాటి నుంచే పొదుపునకు ప్రాధాన్యమివ్వాలి

విద్యార్థినులకు ఎన్నారై మేఘన అవగాహన



దెందులూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్ననాటి నుంచే బడ్జెట్ సిద్ధం చేయడం, పొదుపు చేయడం, చదువుతూ వ్యాపారాలు చేయడం బ్యాంక్ అకౌంట్ నిర్వహించడంపై అవగాహన కలిగి ఉండాలని ఎన్నారై నందిగం మేఘన అన్నారు. అమెరికాలో 11 తరగతి పూర్తి చేసిన ఆమె పొదుపునకు ప్రాధాన్య మివ్వాలన్న అంశంపై అమెరికాలో ప్రతిష్ఠాత్మకమైన అవార్డు పొందారు. విద్యార్థులు చదువుతో పాటు ఆర్థిక రంగంలో ఏ విధంగా ముందుకు వెళ్లాలనే అంశంపై ప్రాజెక్టులో భాగంగా కొవ్వలి హైస్కూల్ విద్యార్థుల కోసం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. అమెరికాలో అనేక క్లబ్‌లకు అధికారిగా మేఘన పదవులు నిర్వహిస్తున్నారు. ప్రాజెక్టులో భాగంగా మేఘన తన తండ్రి జన్మభూమి కొవ్వలిలో వర్క్‌షాపును రెండు రోజులు పాటు నిర్వహించారు. చిన్ననాటి నుంచి తల్లిదండ్రులపై ఆధారపడకుండా చదువుతూనే పిల్లలకు ఇచ్చిన డబ్బులను ఏ విధంగా పొదుపు చేయాలనే విషయంపై వివరించారు.

పీఆర్ డిప్లొమా ఇంజనీర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 18న విజయవాడలోని ఈఎన్సీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని పంచాయతీ రాజ్ డిప్లొమో ఇంజనీర్ల సంఘం హెచ్చరించింది. ఏలూరు జిల్లా అధ్యక్షుడు మురళీ కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన బదిలీ కౌన్సెలింగ్‌లో డిప్లొమో ఇంజనీర్లకు అన్యాయం జరిగిందన్నారు. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న 74 మంది సైట్ ఇంజనీర్లను రెగ్యులర్ చేసేందుకు సిఫారసు చేయడంలో పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. ఇంజనీర్లపై గత ప్రభుత్వం బనాయించిన విజిలెన్స్ కేసుల ఎత్తివేతకు ప్రభుత్వం సిఫార్సు చేయాలని కోరారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సర్వీసును జీవో 296 సర్వీసు రూల్స్‌లో మిళితం చేస్తూ జేటీవోలుగా పూర్తిస్థాయిలో అన్ని ఇంజనీరింగ్ శాఖలలో ఏఈలకు సహాయకులుగా ఆపై ఏఈలుగా నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి బోసుబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఐవికే విశ్వనాథరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విజయ్‌కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బులిస్తే ఉద్యోగం!

ప్రభుత్వ శాఖల్లో కొలువులంటూ సొమ్ము వసూలు చేసి పరారీ

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

నలుగురి అరెస్టు.. పరారీలో మరో నలుగురు



వివరాలు వెల్లడిస్తున్న విజయనగరం డీఎస్పీ

విజయనగరం క్రైం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు జిల్లాలకు చెందిన నిందితులంతా వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పడి నిరుద్యోగులను మోసగించారు. వివరాలిలా ఉన్నాయి. విజయనగరం ప్రదీప్‌నగర్‌కు చెందిన కొత్తపల్లి సాయివెంకట సుజిత్, విజయనగరం మండలం చెల్లూరు గ్రామానికి చెందిన చెక్కా మహేష్, ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడేనికి చెందిన నైనారపు చేతన్ రూబిన్‌కుమార్, ఏలూరుకు చెందిన గుంటూరు జాన్, ఏలూరు జిల్లా గొల్లాయిగూడెంనకు చెందిన కలపల యాకోబ్, శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు, శేషగిరిరావు, లక్ష్మీనారాయణ రెడ్డి గ్రూప్‌గా ఏర్పడ్డారు. తమ వాట్సాప్ స్టేటస్‌ల్లో ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు ఉన్నాయంటూ పోస్టులు పెట్టారు. దీంతో ఎస్.కోట మండలం ధర్మవరం గ్రామానికి చెందిన సిరికి వినోద్, లోతేటి జ్యోతి, పూసపాటిరేగ మండలం రెల్లివలసకు చెందిన తాటిపూడి జయరాజ్, అదే మండలానికి చెందిన కొవ్వాడ జాషువా.. సుజిత్‌ను సంప్రదించారు. దీంతో సుజిత్, తమ గ్రూప్ సభ్యులు కలిసి బాధితుల నుంచి 2022 నుంచి 2024 వరకూ అంచెలంచెలుగా రూ.53 లక్షలు వసూలు చేశారు. అలాగే ముత్యాల రామచంద్రరావు, కొరుప్రోలు శివకుమార్ అనే నిరుద్యోగులు కూడా వీరి బారిన పడ్డారు. ఉద్యోగాలు ఎప్పుడు వస్తాయని నిరుద్యోగులు నిలదీయగా.. డబ్బులు తీసుకున్న వారు అమరావతి సెక్రటేరియేట్‌కు గతేడాది తీసుకువెళ్లారు. అక్కడ రెవెన్యూ, అటవీ శాఖ, రైల్వే, సాంఘిక సంక్షేమ శాఖల్లో ఔట్ సోర్సింగుల్లో ఉద్యోగాలు ఉన్నాయంటూ ఆ శాఖలను చూపించి కొంత సమయం పడుతుం దని కాలక్షేపం చేస్తూ వచ్చారు. ఆ తరువాత పత్తాలేకుండా పోవడంతో ధర్మవరానికి చెందిన సిరికి వినోద్ ఈ ఏడాది ఫిబ్రవరిలో సుజిత్‌పై విజయనగరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీఐ శ్రీనివాసరావు విచారణ వేగవంతం చేశారు. ఇటీవల సుజిత్ ఆసుపత్రి పాలయ్యాడు. అతని ద్వారా మిగిలిన నిందితులకు ఫోన్ చేయించారు. దీంతో సుజిత్‌ను పరామర్శించేందుకు ఆస్పత్రికి వచ్చిన చెక్కా మహేష్, నైనారపు చేతన్ రూబిన్ కుమార్, గుంటూరు జాన్, కలపల యాకోబ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో మోసం చేసినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి రూ.6 లక్షల నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. సుజిత్ ఆసుపత్రిలో ఉండగా, శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు, శేషగిరిరావు, లక్ష్మీనారాయణ రెడ్డి పరారీలో ఉన్నారని చెప్పారు. వారిని కూడా త్వరలో అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. ఈ గ్యాంగ్ పలు జిల్లాల్లో మోసాలకు పాల్పడినట్టు విచారణలో వెల్లడైందని అన్నారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ శ్రీనివాసరావు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ డీజీపీ వెంకటేశ్వరరావు

నూనె గింజల ఉత్పత్తిని పెంచాలి

రిటైర్డ్ డీజీపీ వెంకటేశ్వరరావు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో నూనె గింజలు పూర్తిస్థాయిలో ఉత్పత్తి కాక ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని రిటైర్డ్ డీజీపీ ఎ.బి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పుల్లారి సోమశేఖరా చార్యులు అధ్యక్షతన పామాయిల్ రైతుల సమస్యలపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఏబీవీ ముఖ్య అతిథిగా మాట్లా డుతూ మిల్లర్లు, దళారులకు రైతులు వ్యవసాయ ఉత్పత్తులను అమ్మిన తర్వాత ప్రభుత్వాలు ధరలు నిర్ణయిం చడంతో రైతులు తీవ్రంగా నష్టపో తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెదవేగిలోని పామాయిల్ ఫ్యాక్టరీకి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలు ఏర్పాటు చేస్తే దిగు బడులు పెరుగుతాయని, తద్వారా రైతులకు ప్రయోజనం కలుగుతుం దన్నారు. దిగుమతి సుంకం తగ్గింపు వల్ల ఎకరానికి రూ. 24 వేలు పామాయిల్ రైతులు, కౌలు రైతులు నష్టపోతున్నారని తెలిపారు. సుంకాలపై కేంద్ర ప్రభుత్వం పునః సమీక్షించి రైతాంగాన్ని రక్షించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో పలు తీర్మానా లు చేసి వాటిపై పోరాడేందుకు ఐకమత్యంగా రైతులంతా ఉండాలంటూ నాయకులు పిలుపు నిచ్చారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్, పామాయిల్ రైతు సంఘం సీనియర్ నాయకులు వసంతరావు, కొమ్మన నాగేశ్వరరావు, ములగలంపాడు సర్పంచ్, పామాయిల్ రైతు రాజేష్, ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని రామారావు, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రెడ్డి శ్రీనివాస డాంగే, కె.బుచ్చిబాబు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కంచర్ల గురవయ్య, ఉపాధ్యక్షుడు గోలిమే బాలయేసు, పామాయిల్ రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.



ఆలయ పునః ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

మండవల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరవపట్నం పంచా యతీ శివారు శోభనాద్రిపురంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మచిలీపట్నానికి చెందిన ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలోని రుత్వికులు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. అన్నసమారాధన జరిగింది. ఆదివారం వైభవంగా పునఃప్రతిష్ఠ జరుగుతుందని గ్రామస్థులంతా పాల్గొనాలని ఆలయ నిర్వాహకులు భైరవానందం తెలిపారు.

కాలుష్య కోరల్లో కడలి



వ్యర్థాలతో సముద్రాలకు తీరని నష్టం

కాలుష్యంతో పర్యావరణానికి ముప్పు

తరిగిపోతున్న మత్స్య సంపద

నేడు మహా సముద్ర దినోత్సవం

మొగల్తూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మన నిర్లక్ష్యం సముద్రాలకు తీరని నష్టం కలిగిస్తున్నది. సముద్రాలు చెత్తతో నిండిపోతున్నా పర్యావరణానికి ముప్పువస్తున్నా ప్రపంచ దేశాలన్నీ చూసి చూడనట్టుగా ఉండటంతో మత్స్య సంపదతో పాటు సముద్రం నుంచి లభించే విలువైన సంపద కనుమరుగవుతోంది. సముద్ర జలాల రక్షణకు ప్రతీ ఏటా జూన్ 8న ప్రపంచ మహా సముద్ర దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1952లో బ్రెజిల్‌లో జరిగిన ధరిత్రి సదస్సులో సముద్రాలపై అవగాహన కల్పించేందుకు ప్రపంచ సముద్ర దినోత్సవాన్ని ప్రతీ ఏటా జరుపుకోవాలని నిర్ణయించాయి.

మత్స్యసంపద కంటే ప్లాస్టిక్ ఎక్కువ

సముద్రంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల 2050 నాటికి దాదాపు 40 శాతం చేప జాతులు అంతరిస్తాయని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అప్పటికీ సముద్రాల్లో చేపల కంటే ప్లాస్టిక్ వ్యర్థాలే ఎక్కువగా ఉంటాయని పర్యావరణవేత్తలు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో 19 కిలోమీటర్ల సాగర తీరం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని నరసాపురం నియోజకవర్గంలో 19 కిలో మీటర్ల సాగరతీరం ఉంది. పశ్చిమ గోదావరితో పాటు కృష్ణా జిల్లా నుంచి వచ్చే డ్రెయిన్‌లు, కొల్లేరు ఉప్పుటేరుల నీరంతా పేరుపాలెంలోని సముద్ర ముఖద్వారం ద్వారా సముద్రంలో చేరుతుంది. దీంతో సముద్రం కాలుష్యం పెరిగి సముద్ర జాతులు కనుమరుగవుతున్నాయి. నరసాపురం నియోజకవర్గంలో సుమారు 1200 మంది మత్యకారులు దాదాపు 300 పడవలతో నిత్యం సముద్రవేటపై ఆధారపడి జీవిస్తున్నారు. సముద్ర ఉత్పత్తులు తగ్గిపోవడంతో వేటే ఆధారంగా జీవించే తమకు సరైన ఆదాయం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సముద్రంలో కాలుష్యం పెరగడంతో అలల ఉధృతి పెరిగి గ్రామాలు కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడింది. నరసాపురం మండలం చినమైన వానిలంక, బియ్యపుతిప్ప గ్రామాల్లో సముద్రం దాదాపు మూడు కిలోమీటర్ల ముందుకు చొచ్చుకు రావడంతో సరుగుడు, కొబ్బరి తోటలు కనమరుగవుతున్నాయి.

ఆహ్లాదం పంచుతున్న కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లు

జిల్లాలోనే పేరొందిన కేపీ పాలెం, పేరుపాలెం సాగర తీరాలు పర్యాటకులను అహ్లాదపరుస్తున్నాయి. ప్రతీ ఏటా కార్తీక మాసంలో లక్షలాది మంది సందర్శకులు బీచ్‌ను సందర్శించి పుణ్య స్నానాలు చేస్తున్నారు. నిత్యం సందర్శకుల రాకతో పేరుపాలెం బీచ్ వద్ద చెత్తా చెదారాలతో కాలుష్యకరమైన నీటితో పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. పర్యావరణ వేత్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కేపీ పాలెం, పేరుపాలెం సాగర తీరాలను కాలుష్య రహిత బీచ్‌లుగా తీర్చిదిద్దాలని పర్యాటకులు, స్థానికులు కోరుతున్నారు.



భక్త జనసంద్రం..శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్న క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. ఏడుకొండలవాడి నామాలను కీర్తిస్తూ వేలాదిగా భక్తులు చిన్నతిరుమల క్షేత్రానికి విచ్చేశారు. దాదాపు 30 వేల మందికి పైబడి భక్తులు క్షేత్రానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తెల్లవారుజామునుంచే ఆలయానికి భక్తుల రాక ప్రారంభమైంది. భక్తుల రద్దీకి అనుగుణంగా ఎండ తాకిడి తగలకుండా ఆలయ అనివేటి మండపం నుంచి దాదాపు జంట గోపురాల వరకూ తాత్కాలిక చలువ పందిళ్లు వేశారు. శ్రీవారి వైకుంఠం క్యూకాంప్లెక్స్ ఐదు కంపార్ట్ మెంట్లు భక్తులతో నిండిపోయింది. శ్రీవారి ఉచిత దర్శనానికి 3 గంటల పైబడి సమయం పట్టింది.

ఒకరోజు ఆదాయం రూ.43 లక్షలు

ఆలయానికి వచ్చిన సామాన్యభక్తులకు పెద్దపీట వేసేలా అన్ని చర్యలు చేపడతామని ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి అన్నారు. శనివారం స్వామివారికి ఒక్కరోజే దాదాపు రూ.43 లక్షల మేర ఆదాయం లభించినట్లు వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చిన కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకూ వీఐపీ (అంతరాలయ) దర్శనాలను రద్దు చేసినట్లు చెప్పారు. ఇకపై ప్రతీ శని, ఆది వారాలు, పర్వదినాల్లోను, ఇతర అవసరాల మేరకు అంతరాలయ దర్శనాలు రద్దు చేస్తామని వివరించారు.

మొరాయిస్తున్న ఆర్టీసీ బస్సులు

ఏలూరులో ఆగిపోయిన మూడు బస్సులు

నానా అవస్థలు పడ్డ ప్రయాణికులు

ఏలూరు క్రైం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : అసలే వేసవి కాలం.. ప్రయాణాలు చేయాలంటే ఇబ్బందికరం. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలను కొనసాగిస్తారు. వేకువజామునో, ఉదయాన్నో, సాయంత్రం వాతావరణం చల్లబడిన తరువాత ప్రయాణాలు చేసేందుకు ప్లాన్ చేసుకుంటారు. ఎక్కువగా ఆర్టీసీ బస్సు ప్రయాణానికి ప్రాధాన్యత ఎక్కువ ఇస్తూంటారు. జిల్లాలో జంగారెడ్డిగూడెం, నూజివీడు, ఏలూరులలో మాత్రమే ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. అంతేకాకుండా ఇతర డిపోల నుంచి కూడా బస్సుల రాకపోకలు సాగిస్తుంటాయి. తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా తరచుగా ఒకవైపు సత్తుపల్లి నుంచి ఏలూరు, సత్తుపల్లి నుంచి రాజమహేంద్రవరం వెళ్ళే బస్సులు జిల్లా మీదుగానే వెళ్తూ ఉంటాయి. అయితే జంగారెడ్డిగూడెం, ఏలూరు బస్సు డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేయాలంటే అది ఎప్పుడు గమ్యం చేరుతుందో తెలియని పరిస్థితి. జంగా రెడ్డిగూడెం నుంచి ఏలూరు వచ్చే సమయంలో ఆర్టీసీ బస్సులు ఎక్కడో చోట ఆగిపోతున్నాయి. ఏలూరు బస్సులు కూడా నిత్యం ఏదో ప్రాంతంలో ఆగిపోతూనే ఉన్నాయి. దీంతో ప్రయాణికులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో బస్సు ఆగితే ఎవరు ఆ బస్సుకు పూర్తిస్థాయి క్లియరెన్స్ ఇచ్చారనేది పరిశీలన చేసేవారు. సిబ్బంది లేకపోవడంతో కొన్ని బస్సులను అసలు ఫిట్‌నెస్ పరిశీ లించకుండానే రోడ్లపై తిప్పేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. శనివారం ఒక్క రోజే ఏలూరు గూడ్స్‌షెడ్డు రోడ్డు వద్ద ఒక ఆర్టీసీ బస్సు, పాతబస్టాండ్ సిగ్నల్ వద్ద ఒక ఆర్టీసీ బస్సు, జ్యూట్ మిల్లు వద్ద మరో ఆర్టీసీ బస్సు ఆగిపోయాయి. గంటల తరబడి నిలిచి పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పూర్తిస్థాయిలో మెకానిక్‌లతో పరిశీలన జరిపిన తరువాతే రోడ్లపైకి బస్సులను పంపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్రైం సమాచారం

దంపతుల మధ్య వివాదం..

మనస్తాపంతో భర్త ఆత్మహత్య



పి.దుర్గ(ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): భార్యభర్తల మధ్య గొడవతో మనస్తాపం చెందిన వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాడేపల్లిగూడెంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. స్థానిక గణేష్‌నగర్‌కు చెందిన పెద్దపాటి దుర్గ (38) వడ్రంగి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల వారి సొంత ఇంటి పైకప్పు లీకై వర్షం పడుతుందని వేరే ఇంటికి అద్దెకు వెళ్లారు. శనివారం ఖాళీ చేసి ఇంటి వద్దకు వెళ్లి తలుపులు వేసుకున్నాడు. చాలాసేపటి వరకు తలుపులు తీయకపోవడంతో స్థానికులు తలుపులు పగులగొట్టి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్‌ఐ బాదం శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలో పంచామా నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో ఒకరు..

ముదినేపల్లి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక వ్యక్తి తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బంటుమిల్లి మండలంలో జరిగింది. పుట్టింటి వద్ద ఉన్న భార్య దగ్గరకు వెళ్లి తిరిగి వచ్చిన అనంతరం ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి శివారు బండ్ల గూడెం గ్రామానికి చెందిన యెహోషువా (36)కు కైకలూరు మండలం కొట్టాడకు చెందిన సంధ్యకు పదేళ్ల క్రితం వివాహమైంది. యెహోషువా ముదినేపల్లి మండలం పేరూరు గ్రామంలో ఒక చేపల చెరువుపై పనిచేస్తూ ఆ గ్రామంలోనే భార్యా పిల్లలతో నివాసం ఉంటున్నాడు. ఏడాదిగా భార్యాభర్తల మధ్య విబేధాలు తలెత్తాయి. కొంతకాలంగా భార్య కొట్టాడలోని పుట్టింటి వద్దే ఉంటున్నది. ఈ పరిస్థితుల్లో శుక్రవారం యెహోషువా భార్య దగ్గరికి వెళ్లి తిరిగి రాత్రికి పేరూరు వచ్చి తాను నివాసం ఉంటున్న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై మృతుడి సోదరుడు సాల్మన్ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి హెడ్ కానిస్టేబుల్ శంకరరావు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వివాహిత..

మండవల్లి జూన్ 7(ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవపడి ఓ వివాహిత మనస్తాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో శనివారం వెలుగు చూసింది. మండవల్లి ఎస్సై రామచంద్రరావు వివరాల ప్రకారం మండలంలోని గున్ననపూడి శివారు లేళ్ళపూడి గ్రామానికి చెందిన కోరం సతీష్‌కు రాజేశ్వరితో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు. శుక్రవారం కుటుంబ వ్యవహారాల నేపథ్యంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అనంతరం సతీష్ పనికి వెళ్లిపోగా, మనస్థాపానికి గురైన రాజేశ్వరి మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇంటిలోనే రేకుషెడ్డుకు ఉన్నరాడ్డుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసినట్టు, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్ తిరగబడి కూలీ మృతి

ఏలూరు క్రైం : ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడపడంతో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఆ ట్రాక్టర్‌పై ఉన్న కూలీ ఒకరు మృతి చెందాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు చెందిన వణుగు అనిల్ చంద్రకుమార్(28) కొంతకాలం నుంచి ఏలూరు సమీపంలో దుగ్గిరాలలో ఉంటూ ట్రాక్టర్‌పై కూలి పనులకు వెళ్తున్నాడు. శుక్రవారం రాత్రి పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా ఏలూరు సమీపంలోని మెయిన్‌బైపాస్ రత్నాస్ హోటల్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంగా నడిపి బోల్తా కొట్టించాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన అతడిని ఒక ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడ నుంచి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్ప టికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి శనివారం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం : ప్రభుత్వం ఇచ్చే దివ్యాంగుల పెన్షన్‌ను తీసుకోవడానికి వచ్చి ఆ తరువాత తాను ఇంటిని నిర్మించడానికి పునాదులు వరకు నిర్మించిన స్థలంలోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెంది కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లడంతో ఇరుగుపొరుగు వారు గుర్తించారు. ఏలూరు గొల్లాయిగూడెంలో 85 గజాల స్థలం తంగేటి నరసింహారావు(55)కు ఉంది. 15 ఏళ్ల క్రితం తనభార్య, పిల్లలను వదిలివేసి పెయింటింగ్ పనులు చేసుకోవడానికి ఏలూరులోని గొల్లాయిగూడెం వచ్చి ఒక మహిళతో సహజీవనం చేశాడు. ఆమెను నాలుగేళ్ల క్రితం వదిలి వేశాడు. అతడు కొంతకాలం క్రితం రోడ్డు ప్రమాదానికి గురికావడంతో కాళ్లు విరిగిపోయాయి. సదరం సర్టిఫికెట్ పొంది దివ్యాంగుల పెన్షన్‌ను ప్రతినెలా పొందుతున్నాడు. ఏ ఊరులో ఉంటున్నాడో తెలియదు. ప్రతి నెల మాదిరిగా గతనెల 31న వచ్చి పెన్షన్ తీసుకుని ఎండల వల్ల స్థలం వద్ద మరణించి ఉంటాడని భావిస్తున్నారు. సమాచారం తెలుసు కున్న వన్ టౌన్ పోలీసులు వెళ్లి పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఊరెళ్లి వచ్చేసరికి దోచేశారు..

ఆచంట, జూన్7(ఆంధ్రజ్యోతి): ఆచంట మండలం కొడమంచిలికి చెందిన జాన విజయకృష్ణ ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తు లు బంగారు ఆభరణాలు అపహరించిన ఘటన నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఈనెల 5న జాన్ విజయకృష్ణ తన భార్య, పిల్లలతో భద్రాచలం వెళ్లి తిరిగి ఈనెల 6వ తేదీ రాత్రి ఇంటికి వచ్చి చూడగా తూర్పు ముఖ ద్వారం పగులగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంటిలో బీరువా తలుపులు తెరవబడి ఉండగా అందులో ఉండాల్సిన నల్లపూసల తాడు, బంగారు మేటీలు, చెవిదిద్దులు, చైన్, బంగారు దిద్దులు, వెండి పట్టీలు, కొంత నగదు కూడా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోగా సుమారు ఏడు కాసులు బంగారం గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. జాన విజయ కృష్ణ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటరత్నం తెలిపారు.

దొంగనోట్ల చలామణి ముఠా నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్

భీమడోలు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): దొంగ నోట్లను చలామణితో అమాయక ప్రజల్ని మోసగిస్తున్న ముఠా ప్రధాన నిందితుడుని భీమడోలు పోలీసులు అరెస్టు చేశారు. శనివారం భీమడోలు సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో డీఎస్పీ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాలివి.. ద్వారకాతిరుమల మండలం లక్ష్మీపురానికి చెందిన కోడూరి రవితేజ అనే వ్యక్తి ప్రస్తుతం జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్నాడని కొంతమంది సభ్యులతో కలిసి ముఠాగా ఏర్పడి దొంగనోట్లు మారుస్తూ ప్రజల్ని మోసగిస్తున్నట్టు తెలిపారు. గతనెల 2వ తేదీన ద్వారకాతిరుమలలో హోటల్ నడుపుతున్న కొల్లి సుబ్రహ్మణ్యం అనే వ్యక్తిని కలిసి రెండు లక్షల 50 వేల రూపాయలు అసలు సొమ్ము ఇస్తే రూ.15 లక్షలు దొంగనోట్లు ఇస్తానని ప్రలోభపెట్టి తన ముఠాసభ్యులు షేక్ నాగూర్ మీరావలి, వీరంకి రాజేష్‌లతో దొంగనోట్లు పంపించి మారుస్తుండగా ద్వారకాతిరుమల ఎస్‌ఐ సుధీర్ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. అప్పటినుంచి ప్రధాన నిందితుడు కోడూరి రవితేజ పరారీలో ఉన్నాడు. శనివారం ముందస్తు సమాచారంతో సీఐ విల్సన్ నిందితుడిని అరెస్టు చేశారు. జంగారెడ్డిగూడెంలో జరిగిన చోరీ కేసులలో నిందితుడు రవితేజ నుంచి ఒకకారు, రూ.65 లక్షల దొంగనోట్లు, బంగారు అభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. భీమడోలు సీఐ విల్సన్, ఎస్‌ఐ సుధాకర్ పాల్గొన్నారు.

గణపవరంలో ఐదు కేజీల గంజాయి స్వాధీనం

» నలుగురి అరెస్టు.. మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం » ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్

గణపవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): గణపవరంలో ఐదు కేజీల గంజాయి రవాణా చేస్తున్న నలుగురు నిందితులను గణపవరం పోలీసులు దాడి చేసి అరెస్ట్ చేశారు. శనివారం గణపవరం పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ శ్రావణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. గణపవరం మార్కెట్ యార్డు వద్ద ముందస్తు సమాచారం మేరకు నిడమర్రు సీఐ ఎంవీసుభాష్, గణపవరం ఎస్‌ఐ మణికుమార్, సిబ్బంది కలిసి రవాణా చేస్తున్న ఐదు కేజీల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో ప్రధాన ముద్దాయి ఒడిశా రాష్ట్రం కోరపుట్ జిల్లా నందాపూర్ మం డలం చాట్వా గ్రామానికి చెందిన ఖారాఅర్జున్, పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం కోలమూరుకు చెందిన దగ్గుపల్లి జోగా మారీశ్, గణపవరంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన యాళ్ల సాయికిశోర్, గణపవరం గ్రామం వెలమపేటకు చెందిన రాయపురెడ్డి తరుణ్ గంజాయి సేవిస్తూ, విక్రయాలకు పాల్పడుతున్నారన్నారు. ముద్దాయి ఖారా అర్జున్ ఒడిశాలో ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ అక్రమ సంపాదనకు ఆశపడి గంజాయిపెంచి వాటిని అమ్ముతూ డబ్బులు సంపాదిస్తున్నాడన్నారు. మిగిలిన వారు చెడు వ్యసనాలకు లోనై గంజాయి సేవించి పరిసర ప్రాంతాల వారికి అమ్ముతుంటారని తెలిపారు. వారి వద్ద నుంచి గంజాయితో పాటు మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు.



ముత్యాలమ్మకు సుధాకర్ కుటుంబ సభ్యుల పూజలు

బండి ముత్యాలమ్మకు ఇంటెలిజెన్స్ డీఎస్పీ పూజలు

మొగల్తూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మూడేళ్లకు ఒకసారి నిర్వహించే ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ జాతరలో భాగంగా శనివారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఇంటెలిజెన్స్ డీఎస్పీ మేక సుధాకర్ కనకదుర్గ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఈవో అరుణ్ కుమార్ డీఎస్పీ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో పెద్దలు లక్కు బాలాజీ, దేశంశెట్టి శ్రీను, దూసనపూడి కోటి, మైలాబత్తుల రాంబాబు పాల్గొన్నారు.

బంగారు గొలుసు దొంగ అరెస్ట్

నరసాపురం రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : చైన్ స్నాచింగ్ కేసులో పట్టణానికి చెందిన చలపక విజయ్‌కుమార్‌ను అరెస్టు చేశామని రూరల్ సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు. శనివారం సర్కిల్ కార్యాలయంలో ఎస్‌ఐ దుర్గాప్రసాద్‌తో కలిసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. వైఎస్‌పాలెం కు చెందిన చెన్ను లక్ష్మి తన భర్త వెంకటేశ్వరరావుతో గతనెల 29న ఆస్పత్రికి వెళ్లి తిరిగి వైఎస్‌పాలెం వద్ద ఆటో దిగి ఇంటికి నడుచుకుని వెళుతున్నారు. మార్లమ్మ గుడి వద్దకు వచ్చిన తరువాత గుర్తుతెలియని వ్యక్తి మెడలోని నల్లపూసల గొలుసును చోరీ చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకటసురేష్ కేసు నమోదు చేశారు. ఈనెల 6న లెప్రసీ ఆసుపత్రి దగ్గరలో ఉన్న అన్నపూర్ణ గార్డెన్స్ ఎదురుగా ముద్దాయి విజయ్‌కుమార్‌ను అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 17.60 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నామ న్నారు. శనివారం కోర్టుకు హాజరుపర్చగా నిందితుడికి 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్టు సీఐ చెప్పారు.

రాచూరుకు ట్యాంకర్‌తో మంచినీటి సరఫరా

ఉంగుటూరు,జూన్ 7(ఆంధ్రజ్యోతి) :ఉంగుటూరు మండలం రాచూరు గ్రామంలో శనివారం తాగునీటి సమస్య ఏర్పడింది. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పార్టీ కార్యాలయానికి సమాచారం అందడంతో లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. ఈ మేరకు తక్షణమే మంచినీటిని ఫౌండేషన్ ద్వారా సరఫరా చేయడంతో స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

రేపు కలెక్టరేట్ వద్ద పామాయిల్ రైతుల ధర్నా

జీలుగుమిల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి):పామాయిల్ రైతుల సమస్యలపై ఈనెల 9న ధర్నా నిర్వహిస్తున్నట్టు ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సీహెచ్.సీతారామయ్య తెలిపారు. పామాయిల్‌పై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం తగ్గించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఆయా సమస్యలపై కలెక్టరేట్ వద్ద రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. టన్నుకు రూ.22వేలు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయిల్‌పామ్ రైతుల్ని ప్రోత్సహించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయండి

» కలెక్టర్ వెట్రిసెల్వి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ఏడీ-2 వెంకటప్పయ్య

ఏలూరు అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ-2)గా ఇటీవల నియమితులైన ఎం.వెంకటప్పయ్య శుక్రవారం కలెక్టర్ వెట్రిసెల్విని మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నభోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి, ముఖ్యంగా విద్యార్థుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో నూరుశాతం విజయవంతం చేయాలని ఏడీకి కలెక్టర్ సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డీఈవో వెంకటలక్ష్మమ్మ, సమగ్రశిక్ష ఏపీసీ పంకజ్‌కుమార్, తదితరులున్నారు.



లంబాడీ మహిళల నృత్య ప్రదర్శన తిలకిస్తున్న ఎమ్మెల్యే రోషన్, నాయకులు

నాగిరెడ్డిగూడెం సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

చింతలపూడి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిగూడెంలో సారా తయారీ, అమ్మకాలు మానేసి సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సూచించారు. శనివారం నాగిరెడ్డిగూడెంలో పల్లెవెలుగు-స్వర్ణగ్రామం కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుని ఆయన వినతులు స్వీకరించారు. రోడ్లు బాగోలేదని, విద్యుత్ స్తంభాలు ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయని, ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తదితర సమస్యలపై గ్రామస్థులు మొర పెట్టుకున్నారు. ఇదే సభలో గిరిజన లంబాడీ మహిళలు తమ సంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శించారు. తొలుత సారా వల్ల కలిగే అనర్థాలపై నాటిక రూపంలో ప్రదర్శన జరిగింది. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు జె.ముత్తారెడ్డి, ధర్మరాజు, కొత్తపూడి శేషగిరిరావు, శ్రీనివాసరావు, మధుబాబు, విజయకుమారి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముగింపుగా పల్లెనిద్ర జరిపారు.



శ్రీహరి కళాతోరణ వేదికపై అన్నమయ్య గీతాలాపన చేస్తున్న కళాకారులు

అలరించిన అన్నమయ్య కీర్తనలు

ద్వారకాతిరుమల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీహరి కళాతోరణ వేదికపై కళాకారులు శనివారం ఆలపించిన అన్నమయ్య కీర్తనలు పలువురిని అలరించాయి. విశాఖపట్నంకు చెందిన అన్నమయ్య స్వర అకాడమి సభ్యులు ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేసుకున్నారు. అనంతరం కళాతోరణ వేదికపై కూర్చుని శ్రీనివాసుని కీర్తిస్తూ గీతాలను ఆలపించారు.

వేలేరుపాడు ఎస్‌ఐగా వినయ్‌కుమార్

వేలేరుపాడు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): వేలేరుపాడు పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా పి.వినయ్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ కేవీ.రామారావును బదిలీ చేసి ఆయన స్థానంలో జీలుగుమిల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న వినయ్‌కుమార్‌ను నియమించారు. శనివారం బదిలీపై వెళ్లిన రామారావుకు పోస్టింగ్ ఇవ్వకుండా వీఆర్‌లో ఉంచినట్టు తెలిసింది.

అడవిలో అటెన్షన్

(5వ పేజీ తరువాయి)

ప్రాంతాలను తమ షెల్టర్ జోన్లుగా వినియోగించుకునే వారు. 2000 సంవత్సరం మార్చి 17న జలతార్ వాగు వద్ద మొట్టమొదటి పోలీసులకు నక్సల్స్‌కు కాల్పులు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు నక్సల్స్ ఇద్దరు స్పెషల్ పార్టీ పోలీసులు మరణించారు. తర్వాత 2008 వరకూ పలు ఎన్‌కౌంటర్లు జరిగాయి. జిల్లాలో మొత్తం ఎనిమిది ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఇందులో ముఖ్య నాయకులతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన నాయకులు మరణించారు. అప్పటి నుంచి జిల్లాలో ఎక్కడా నక్సల్స్ జాడలేదు. కేంద్ర ప్రభుత్వం నక్సల్స్ రహిత జిల్లాగా గుర్తించింది. అయినప్పటికీ జిల్లాలో పోలీస్ యంత్రాంగం ఏజెన్సీ ప్రాంతాల్లో ముందస్తు చర్యలతో, స్పెషల్ పార్టీ పోలీసులు కూబింగ్ కొనసాగిస్తూనే ఉన్నారు.

అణువణువూ గాలింపు

మరోవైపు జాతీయ పోలవరం ప్రాజెక్టుకు 2000 డిసెంబరులో ఏలూరు సమీపంలో కలపర్రు వద్ద శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పోలవరం ప్రాజెక్టు పనులు జరుగుతున్న నేపథ్యంలో స్పెషల్ పార్టీ పోలీసులతో మన జిల్లాతోపాటు గోదావరి అటు వైపు ఉన్న తూర్పుగోదావరి జిల్లాలో కూంబింగ్ నిరంతరం కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టుకు వీవీఐపీల పర్యటనలు జరుగుతున్న నేపథ్యంలో ముందస్తుగా ప్రాజెక్టుకు 15 కిలోమీటర్ల నుంచి 30 కిలోమీటర్ల పరిధి వరకూ మూడంచెల భద్రతతో కూంబింగ్ కొనసాగిస్తున్నారు.

ఎప్పటికప్పుడు ఆర్మ్‌డ్ రిజర్వుడు స్పెషల్ పార్టీ పోలీసులతో, యాంటీ నక్సల్స్ బృందాలు, పోలీసు జాగిలాలతో అటవీ ప్రాంతంలో జల్లెడ పడుతూనే ఉన్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం తీసుకునే చర్యలతో నక్సల్స్ కదలికలు తగ్గిపోయాయి. ఇటీవల ఛత్తీస్‌గడ్, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎన్‌కౌంటర్లు జరగడం, పెదపాడు మండలం సత్యవోలుకు చెందిన సుధాకర్ ఎన్‌కౌంటర్‌లో మరణించడంతో పోలీస్ యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. కేంద్ర, రాష్ట్ర నిఘా సంస్థల సూచనలతో ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు ప్రాంతాల్లో పర్యటనలు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు రద్దు చేసుకోవాలని సూచనలు రావడంతో ఆ దిశగా చర్యలు చేపట్టారు.

భయపడాల్సిన పనిలేదు : ఎస్పీ కేపీఎస్ కిశోర్

జిల్లాలో మావోయిస్టు/నక్సల్స్ కదలికలు లేవు. ఇంటిలిజెన్స్ ఉన్నతాధికారుల ఆదేశాలతో ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు ఎవరు భయపడాల్సిన అవసరం లేదు. ఇప్పటికే కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం ప్రాంతాల్లో స్పెషల్ పార్టీ పోలీసులు, యాంటీ నక్సల్స్ స్క్వాడ్, పోలీస్ జాగిలాలు, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌లు, ఎక్స్‌ప్లోజివ్ డిటెక్ట్ టీమ్‌లు, హైఫ్రీక్వెన్సీ డ్రోన్లతో నిఘా పెట్టాం. అవసరమైన అదనపు బలగాలను ఏజెన్సీ ప్రాంతంలో ఉంచి ముందస్తు చర్యల్లో భాగంగానే గాలింపు నిర్వహిస్తున్నాం. ఇటీవల ఛత్తీస్‌గడ్, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎన్‌కౌంటర్లు జరగడం, ఛత్తీస్‌గడ్ ప్రాంతంలో పూర్తి నిర్బంధం వున్న నేపథ్యంలో ఒకవేళ అటు నుంచి మావోయిస్టులు షెల్టర్ జోన్‌గా జిల్లాను వినియోగించుకోవడానికి జిల్లాలోని అటవీ ప్రాంతాలకు వచ్చే అవకాశాల నేపథ్యంలో జల్లెడపడుతున్నాం.

వేలేరుపాడులో ఏం జరుగుతోంది ?

(5వ పేజీ తరువాయి)

అవకాశాలు ఉంటాయని భావిస్తున్న పోలీసులు అప్రమత్తమయ్యారు. మేడేపల్లి, రామవరం పంచాయతీల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణాలకు శంకుస్థాపన చేసేందుకు శనివారం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పర్యటన ఖరారైంది. అయితే శంకుస్థాపన చేసే గ్రామాలు అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండడంతో భద్రతా చర్యల్లో భాగంగా చివరి నిమిషంలో పోలీసు అధికారుల సూచనలతో పర్యటన రద్దు చేసుకున్నారు. అభివృద్ధి పనులకు కూటమి నాయకులు భూమి పూజ చేసి ముగించారు.




ఏలూరు, జంగారెడ్డిగూడెంలలో ముస్లింల నమాజ్‌లు




శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే చింతమనేని.. ఏలూరు మసీదులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

భక్తిశ్రద్ధలతో బక్రీద్

» మసీదుల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
» పేదలకు దానధర్మాలు చేసిన ముస్లింలు

ఏలూరు రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్ పర్వదిన వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముస్లింలు కర్బలా మైదానం, కొత్తూరు, తంగెళ్లమూడి మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అల్లాను స్మరించుకుని మత పెద్దలు పండుగ ప్రాశస్త్యాన్ని వివరించారు. దైవ ప్రవక్త త్యాగాన్ని స్మరిస్తూ బక్రీద్ వేడుకలను జరుపుకుంటున్నట్టు చెప్పారు. పండుగ సంప్రదాయం ప్రకారం వారి స్థాయి మేరకు దానధర్మాలు చేశారు. బంధుమిత్రులను తమ ఇళ్లకు ఆహ్వానించి మటన్ బిర్యానీలతో ఆతిథ్యం ఇచ్చారు. ముస్లింలను హిందువులు ఇతరులు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణాల్లోని మసీదులు, ఈద్గాలకు తెల్లవారుజాము నుంచే క్యూకట్టారు. ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు.

● ఉంగుటూరు/భీమడోలు : ఉంగుటూరు మండలం చేబ్రోలు, ఉంగుటూరులోని మసీదులలో శనివారం ముస్లింలు బక్రీదు పండుగ సందర్భంగా ప్రార్థనలు చేశారు. భీమడోలు మండలం భీమడోలు మసీదులో హిమామ్ దిల్షాద్ నేతృత్వంలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. మసీద్ చైర్మన్ షేక్ హసీనా మాట్లాడుతూ ప్రవక్త హజరత్ ఇబ్రహీం త్యాగం ఆదర్శనీయమని పేర్కొన్నారు. మసీదు కమిటీ చైర్మన్ షేక్ హసీనా, సైన్‌షాసిద్ధిఖ్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

● చింతలపూడి/లింగపాలెం/జంగారెడ్డిగూడెం : త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను ముస్లింలు ఆనందంగా జరుపుకున్నారు. చింతలపూడి మండలం చింతలపూడి, సీతానగరం, రాఘవాపురం, ప్రగడవరం గ్రామాల్లోని మసీదుల్లో ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా కొందరు మొక్కులు తీర్చుకున్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం, ములగలంపాడులో గల మసీదులలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెంలోని బైనేరు వాగు వద్ద ఉన్న ఈద్గా మైదానంలో బిలాల్ మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ యాకూబ్,కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గురువు అతిక్ పాల్గొని బక్రీద్ విశిష్టతను వివరించారు. ముస్లిం నాయకులు షేక్ ముస్తఫా, షేక్ అక్బర్, షేక్ బాజీ, ఎస్‌కె.మస్తాన్, సయ్యద్ అన్వర్, అల్లాఉద్దీన్, షేక్ ఆరీఫ్, పఠాన్ పర్వేజ్, షేక్ అమీర్, ఎండి.రఫీ, సయ్యద్ అమీరుద్దీన్, షేక్ సలీం ఖాదరి, రిటైర్డ్ ఏఎస్‌దాదా తదితరులు పాల్గొన్నారు.

● దెందులూరు : దెందులూరులో టీడీపీ మైనార్టీ విభాగం జిల్లా కార్యదర్శి షేక్ జహీర్ అహ్మద్ ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు, నమాజ్ చేశారు. పలువురు ముస్లింలు పేదలకు దానం చేశారు. జోగన్నపాలెం మసీదులో సహకార సంఘం బ్యాంకు అధ్యక్షుడు డాక్టర్ పసుమర్తి మధుబాబు నమాజ్ చేశారు. ముస్లిం సంఘం నాయకులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

● టి.నరసాపురం : మండలంలో టి.నరసాపురం, ఏపిగుంట, బొర్రంపాలెం, తెడ్లం, నక్కినవారిగూడెం, అప్పలరాజుగూడెం తదితర గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ వేడుకలు నిర్వహించారు. మసీదుల్లో నమాజ్ చేసి బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అప్పలరాజుగూడెం మసీదు ప్రెసిడెంట్ షేక్ బాషా, షేక్ పాశ్వా, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక బక్రీద్

» ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరుటూటౌన్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక బక్రీద్ పండుగ అని ఎమ్మెల్యే చంటి అన్నారు. కొత్తూరులోని ఈద్గాల్‌లో బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అల్లా ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈద్గాఖాజీ షేక్‌హుస్సేన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అల్లా సందేశాన్ని అందించారు. ఏఎంసీ చైర్మన్ ఎం.పార్థసారథి, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, జావేదు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్ : చింతమనేని

పెదవేగి : పెదవేగి మండలంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ త్యాగానికి, దానగుణానికి ప్రతీక బక్రీద్ అని అన్నారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ముస్లింలు దుగ్గిరాల కార్యాలయంలో ప్రభాకర్‌ను కలిసి ఈద్ ముబారక్ తెలిపారు. లక్ష్మీపురంలో మసీదు గురువు పీఎం.సుభానీ మాట్లాడుతూ ఆధ్యాత్మిక జీవనం సాగించేవారికి అల్లాహ్ రక్షణ ఎల్లప్పుడు ఉంటుందన్నారు.

చినవెంకన్నకు నటుడు సుప్రీత్‌రెడ్డి పూజలు



ద్వారకాతిరుమల, జూన్ 7(ఆంధ్రజ్యోతి): చిన్నతిరుమలేశుని ఆలయాన్ని సినీ నటుడు, సుప్రీత్ రెడ్డి (కాట్రాజు) శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అర్చకుల నుంచి వేదాశీర్వచనం పొందారు. ఛత్రపతి, మర్యాదరామన్న సినిమాల్లో విలన్ పాత్ర పోషించిన ఆయనకు మంచి పేరు వచ్చింది. అశోక్, స్టాలిన్, ఢీ, డాన్, విక్టరీ, ఒంటరి, రెడీ వంటి పలుచిత్రాల్లో నటించారు. ఆయనను గుర్తించిన పలువురు ఫొటోలు, సెల్ఫీలు దిగారు.



అశోక్‌తేజకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రముఖులు

సినీ గేయ రచయిత అశోక్‌తేజకు సత్కారం

ఏలూరురూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, సినీ గేయ రచయిత, నంది అవార్డు గ్రహీత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఏలూరు వచ్చిన సందర్భంగా ఆయనను పలువురు కలిసి సత్కరించారు. శనివారం సాయంత్రం టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పద్మశాలీల సంఘం అధ్యక్షుడు వానపల్లి నాగరాజు, సీనియర్ న్యాయవాది చిక్కా భీమేశ్వరరావు, నేమాల రమేశ్, నేమాల సత్యనారాయణ, భూపతి అప్పారావు, దోనే వెంకటేశ్వరరావు ప్రముఖులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

వీరమళ్ల సూర్యారావు నేత్రదానం



సూర్యారావు (ఫైల్)

టి.నరసాపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొర్రంపాలెంకు చెందిన వీరమళ్ల సూర్యారావు శుక్రవారం మృతి చెందారు. మరొకరికి చూపునిచ్చేందుకు సూర్యారావు నేత్రాలు దానం చేయడానికి కుటుంబసభ్యులు, భార్య వీరమ్మ, కుమారులు సత్యనారాయణ, వెంకటేశ్వర రావు అంగీకరించారు. విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి సిబ్బంది సూర్యారావు నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో ప్రసాద్ నేత్ర వైద్యాలయం టెక్నీషియన్‌లు సుధారాణి, హరికృష్ణ తెలిపారు.

చిన్నారుల మజ్జిగ చలివేంద్రం

జంగారెడ్డిగూడెం,జూన్ 7(ఆంధ్రజ్యోతి): చిన్నారులు దాచుకున్న డబ్బులతో పట్టణంలోని అశ్వారావుపేట రోడ్డులోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బాటసారులకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. పట్టణానికి చెందిన తాటికొండ సాయిబాబు, లక్ష్మీకాంతం దంపతుల మనుమలు, మనవరాండ్రు రష్మిత, కార్తికేయ, గీతాన్ష్ వేసవి సెలవులకు పట్టణానికి వచ్చి ఈవిధంగా ప్రజలకు ఉపయోగపడే మంచి కార్యక్రమం చేపట్టడంతో చిన్నారులను పలువురు అభినందించారు. స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ కమిటీ సహకారంతో రూ.పది వేలు తాము దాచుకున్న డబ్బుతో మజ్జిగ పంపిణీ చేశారు. గండికోట బాబీ, మాడా ప్రవీణ్, చిట్లూరి వెంకటేశ్వరరావు, నాగు, రోహిణి, నాగసూరి వసంత్ పాల్గొన్నారు.

యువకుడి మృతిపై కేసు నమోదు

భీమడోలు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : అదుపు తప్పి మోటారు సైక్లిస్టు చెట్టుకు ఢీకొన్న ఘటనలో సైదు సాయికృష్ణగంగా ప్రసాదు(21)అనే వ్యక్తి మృతి చెందాడు. భీమడోలు ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాలివి.. ఆగడాలలంకకు చెందిన సైదు సాయికృష్ణ తన స్నేహితుడి రిసెప్షన్‌కు ఈనెల ఆరో తేదీన ఏలూరు వెళ్లి తిరిగి రాకపోవడంతో తండ్రి ఫిర్యాదు మేరకు వడ్డిగూడెం సమీపంలో అతడు చెట్టుకు ఢీకొని మృతి చెందినట్టు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఏలూరు ఆసుపత్రికి తరలించి దర్యాప్తు జరుపుతున్నట్లు భీమడోలు ఎస్‌ఐ సుధాకర్ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో అటవీ ఉద్యోగులకు గాయాలు

ఏలూరు క్రైం, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : విధులను ముగించుకుని తిరిగి వస్తుండగా ఒక వ్యాన్ ఎదురుగా వచ్చి ఢీకొని వెళ్లిపోవడంతో ఇద్దరు అటవీ ఉద్యోగులు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఏలూరులో నివాసం ఉంటున్న ఫారెస్టు బేస్‌క్యాంప్ హెల్పర్లు జి నాగన్న, ఎన్.సహదేవుడు ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక ప్రాంతాల్లో విధులను నిర్వర్తించుకుని శనివారం రాత్రి ఏలూరు వస్తుండగా మార్గమధ్యలో బొలెరో వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో వీరిద్దరూ తీవ్రగాయాలకు గురికాగా ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న బీజేపీ నాయకులు

'కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'

ఏలూరు రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఏర్పడి ప్రధాని నరేంద్ర మోదీ పదకొండేళ్ల కాలంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ రాష్ట్ర సంఘటన్ మంత్రి మధుకర్ జి.పిలుపునిచ్చారు. శనివారం ఏలూరులో 'మోదీ ప్రభుత్వ సేవా సుపరిపాలన సంకల్పంతో సహకారం' పేరుతో బీజేపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్‌కిషోర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గడిచిన పదకొండేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు పేదలకు చేకూరేలా చేశారని, దేశాన్ని ప్రగతి పథంలో నడిపించిన నాయకుడిగా పేరుగాంచారన్నారు. వీటిలో భాగంగానే మొక్కలు నాటే కార్యక్రమం, యోగా నిర్వహించాలని, అనేక సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీలో చేరారు, వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపన చౌదరి, నిమ్మల కిషోర్, కె.సుధాకర్ కృష్ణ, కె.కృష్ణప్రసాద్, నడపన దానభాస్కర్, బొరగం వెంకటలక్ష్మి, కట్ట సత్యనారాయణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీసీ సంఘాల నేతలు

కుల గణన హేతుబద్ధంగా జరిపించాలి

ఏలూరు రూరల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సగంపైగా బీసీలు ఉన్నారని కుల గణన హేతుబద్ధంగా జరిపించాలని పలు బీసీ సంఘాల నాయకులు కోరారు. శనివారం జిల్లా యాదవ సంఘం భవనంలో ఆంధ్రప్రదేశ్ బీసీ కులాల జేఏసీ ఆధ్వర్యంలో డాక్టర్ లంక వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు పలువురు మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లు పెంచాలని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గీకరణ విధానం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పరిధి నుంచి బీసీలను తప్పించాలన్నారు. విముక్త జాతులకు ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. సంచార తెగల విద్యార్థులకు ప్రతీ జిల్లాలో రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటుపై చర్చించడానికి కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా సంఘాల నేతలు తాడిశెట్టి గోపిరావు, అన్నపురెడ్డి మురళి, లక్ష్మీకుమార్, మురళీమోహన్, కె.శివకుమార్, లక్కోజు రాజగోపాలచారి, కేవీపీ మాధవరావు, ఉక్కుసూరి గోపాలకృష్ణ, యేసురాజు, పరసా శ్రీనివాస్, తాతారావు, టి.ఆంజనేయులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ రేటింగ్ విద్యార్థులకు అభినందనలు



కుశాంక్ శ్రీవిశ్వ.. యశ్వంత్ నాయక్

జంగారెడ్డిగూడెం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన దివ్యాస్ మాస్టర్స్ అకాడమీ విద్యార్థులు అంతర్జాతీయ ప్లేయర్లుగా రేటింగ్ సాధించినట్లు కోచ్ అయినపర్తి సరళామాధవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మల్లంపల్లి కుశాంక్ శ్రీవిశ్వ 1,552 ర్యాపిడ్ రేటింగ్ సాధించి ఇంటర్నేషనల్ ర్యాపిడ్ చెస్ రేటింగ్ ప్లేయర్‌గా, గుగ్గులోతు యశ్వంత్ నాయక్ 1,410 చెస్ రేటింగ్ సాధించి ఇంటర్నేషనల్ క్లాసికల్ చెస్ ప్లేయర్‌గా రేటింగ్ సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరచి అంతర్జాతీయ స్థాయి ప్లేయర్‌లుగా ఘనత సాధించిన ఇద్దరికి అభినందనలు తెలిపారు.



వాకర్స్ సమావేశంలో మాట్లాడుతున్న వాకర్స్ క్లబ్ గవర్నర్ రాజు

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

కొయ్యలగూడెం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడు కోవాలని వాకర్స్ క్లబ్ గవర్నర్ రాజు అన్నారు. ఈ మేరకు శనివారం ఉదయం స్థానిక ప్రభుత్వ కాలేజీ గ్రౌండ్‌లో వాకర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. తొలుత యోగాలో పాల్గొన్నారు. వాకర్స్‌ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అరగంట సేపు ఉదయాన్నే నడవాలని కోరారు. ఆరోగ్యం కాపాడుకో వాలంటే మన చేతుల్లోనే ఉందన్నారు. వాకింగ్ ఉపయోగాలను ప్రతీఒక్కరికి తెలియజేయాలన్నారు. వాకర్స్ క్లబ్ ద్వారా త్వరలోనే కొయ్యలగూడెంలో జిమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ ఎస్‌టీజీ శేఖర్, సత్యనారాయణ, సిరివూరి సాయి, మద్దు ప్రసాద్, కొల్లు సత్తిబాబు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నాయకుల నిరసన

ఉంగుటూరు, జూన్7(ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టడానికి అంగీకరించిన అధికారులు ప్రస్తుతం వెబ్‌ఆప్షన్‌లు మళ్లీ పెట్టుకోవాలని కోరడం పట్ల ఉంగుటూరు యూటీఎఫ్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. శనివారం స్థానిక మండల విద్యావనరుల కార్యాలయం వద్ద సంఘ నాయకులు నిరసనలు తెలిపారు. 'వెబ్ కౌన్సెలింగ్ వద్దు మాన్యువల్ ముద్దు' అనే నినాదంతో నిరసన తెలిపారు. ఉంగుటూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉనుముల రాంబాబు, డాకి జోగి నాయుడు, జిల్లా కార్యదర్శి పుప్పాల నరసింహారావు, గౌరవాధ్యక్షులు శీతాల సత్యనారాయణ, అల్లు శ్రీను, బొమ్మిడి ప్రసాదు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శంకుస్థాపన

కుక్కునూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు మండలంలోని పలు పంచాయతీల్లో దాహార్తి తీర్చడానికి కొత్తగా వాటర్ ట్యాంకులు మంజూరయ్యాయి. ఏడు వాటర్ ట్యాంకులకు ప్రభుత్వం రూ.2.33 కోట్లను మంజూరు చేసింది. శనివారం కూటమి నాయకుల ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, నాయకులు కోటగిరి సత్యనారాయణ, ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, రామకృష్ణ, బొల్లి కృష్ణ, కంటి ప్రసాద్, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఎం.యుగంధర్, వెంకన్నబాబు, ఎం.వీరబాబు పాల్గొన్నారు.

సీఎం నిధి సంజీవిని వంటిది

జంగారెడ్డిగూడెం, జూన్7 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి పేద ప్రజలకు సంజీవిని వంటిదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్‌చంద్రశేషు అన్నారు. శనివారం శ్రీనివాసపురం గ్రామంలో రామలక్ష్మి అనే మహిళకు రూ.76,500 సీఎం సహాయ నిధి చెక్కును టీడీపీ నాయకుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ,ఎలికే ప్రసాదరావు, తడికల దావీదు, తాళ్లూరి వెంకటేశ్వరరావు, కొఠారు ప్రసాద్, వీరమళ్ళ దేవి, వరప్రసాద్, కనికళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్స్ అవార్డులకు టెన్త్ విద్యార్థుల ఎంపిక

ద్వారకాతిరుమల/ఉంగుటూరు/లింగపాలెం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): షైనింగ్ స్టార్స్ అవార్డులకు ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెంకు చెందిన బాలికలు ఎంపికయ్యారు. తాడిచర్లలో శశి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పదో తరగతి చదివిన పూజితకు 594 మార్కులు, దుర్గావాణికి 590మార్కులు వచ్చాయి. ఉంగుటూరు మండలం నారాయణపురంలోని ఉషోదయ హైస్కూలుకు చెందిన కె.ఖ్యాతిసాయిశ్రీ ఎంపికైందని పాఠశాల కరస్పాండెంట్ గుణ్ణం బుల్లెబ్బాయి తెలిపారు. బాదంపూడి హైస్కూలుకు చెందిన సిరికి జస్వంత్, గొల్లగూడెం సూర్యపబ్లిక్ స్కూలుకు చెందిన సొంగా లాస్య జాహ్నవి, జి.పూజిత లక్ష్మీదుర్గ, ఎం.నయనసాయి ఎంపికయ్యారు. లింగపాలెం మండలం నుంచి ధర్మాజీగూడెం జడ్పీ హైస్కూల్ విద్యార్థి షేక్ యాకూబ్‌వలీ, ఇతర పాఠశాలల విద్యార్థులు నూర్‌భాషాహనీఫ్, బి.శశివ రుణ్, డి.చంద్రకౌషిక్ చౌదరి, పి.రోహిత ఎంపికైనట్లు ఎంఈవో కె.రామారావు తెలిపారు. వీరంతా ఈనెల 9న కలెక్టర్ చేతుల మీదుగా ఏలూరు రెడ్డి కళాశాల ఆవరణలో సన్మానం, ప్రశంసాపత్రం, రూ.20 వేలు అందుకోనున్నారు.

బీసీ బాలుర వసతి గృహంలో ప్రవేశాలు ప్రారంభం

ముదినేపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ముదినే పల్లిలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ప్రభుత్వ పాఠశాలలు వేసవి సెలవుల అనంతరం ఈ నెల 12 నుంచి పునఃప్రారంభం కానున్నందున 3 నుంచి పదో తరగతి వరకు విద్యార్థులను ఈ వసతి గృహంలో చేర్చుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇంగ్లీష్, హిందీ, సైన్స్, లెక్కల సబ్జెక్టులకు ట్యూటర్లు కూడా ఉన్నారని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ బి.సురేష్‌బాబు తెలిపారు.

'పెంచిన ఆస్తి పన్ను సామాన్యులకు పెను భారం'

నూజివీడు టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సామాన్యులపై పన్ను భారం పెంచడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి. రాజు ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజల పక్షాన పోరాడి పన్నుల భారం తగ్గించేవరకు సీపీఎం పోరాడుతుందన్నారు. సీపీఎం సీనియర్ నాయకుడు మరియు దాసు శోభనాద్రి, వసంతరావు పాల్గొన్నారు.



సాయి సింధు, దివ్య హర్షిణి, లీలాకృష్ణ, ప్రియాంక, టి.ఐశ్వర్య

ఏడుగురు విద్యార్థులకు ప్రతిభ అవార్డులు



టి.సాహితి, ఐ.హిమబిందు

ముసునూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహ కంగా ప్రభుత్వం అందించనున్న ప్రతిభ అవార్డులకు మండలం నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. టెన్త్‌లో 500 పైగా మార్కులను సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 20 వేలు చొప్పున నగదు బహు మతులను అందజేయున్నారు. ముసునూరు గురుకుల బాలికల పాఠ శాలకు చెందిన కొప్పుల సాయి సింధు (578/600), టి.సాహితి (571/600), ఎం.ప్రియాంక (571/600), టి.ఐశ్వర్య (569/600), ఐ.హిమబిందు (550/600)లు ఈ అవార్డులకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.లక్ష్మీ కుమారి తెలిపారు. అలాగే చెక్కపల్లి జడ్పీ పాఠశాలకు చెందిన వడ్డేపల్లి దివ్యహర్షిణి (571/600), చెక్కపల్లి చైతన్య పాఠశాల విద్యార్థి బొలు సు లీలాకృష్ణ (566/600)లు ప్రతిభ అవార్డులకు ఎంపికయ్యారని ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు తెలిపారు. ఈ నెల 9న ఏలూరు సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో జరిగే కార్యక్రమంలో ప్రముఖుల చేతులమీదుగా ఈ అవార్డులు అందుకుంటారని ఎంఈవో తెలిపారు.

టీడీపీ కలిదిండి గ్రామ అధ్యక్షుడిగా అబ్దుల్ అస్లాం



అస్లాంను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

కలిదిండి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కలిదిండి గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా అబ్దుల్ అస్లాం ఏకగ్రీగంగా ఎన్నిక య్యారు. శనివారం కలిదిండలో జరిగిన సమావేశంలో పార్టీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చిట్టూరి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా భట్రాజు ఏసుబాబు, కార్యనిర్వహణ కార్యదర్శులుగా బందెల బాలకృష్ణ, కట్టా మార్రాజు, మాజేటి రాము, కార్యదర్శులుగా ఎండీ యూనస్, మీగ నాగరాజు, మేకా శ్రీనివాసరావు, కోశాధికారిగా అంబటి సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, నాయకులు బోయిన గోవింద్, నున్న సుబ్రహ్మణ్యం, జాన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

గోపవరం గ్రామ కమిటీ ఎంపిక

కైకలూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): టీడీపీని గ్రామ కమిటీలతో మరింత బలోపేతం చేసేందుకు సమర్థవం తమైన కమిటీలను ఎంపిక చేస్తున్నామని మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు అన్నారు. శనివారం కైకలూరు మండలం గోపవరం టీడీపీ గ్రామకమిటీలను ఎంపిక చేశారు. గ్రామపార్టీ అధ్యక్షు డిగా పోలవరపు వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా నాగనబోయిన రమేష్, ప్రధాన కార్యదర్శిగా పట్టపు వెంకట నరసయ్య, కార్యనిర్వహణ కార్యదర్శులుగా చింతపల్లి పద్మనాభం, నూనె మాధవి, జి. ప్రసాద్, కోశాధికారిగా జొన్నగడ్డ బాబురావును ఎంపిక చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని వీరికి సూచించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

మండవల్లి జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో సింగనపూడి ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన ఆరోపణలపై ఇన్‌చార్జి ఎంపీడీవో నాగలింగాచారి శనివారం విచారణ చేపట్టారు. గ్రామంలోని కూలీలతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్న కొంతమందికి ఉపాధి పనులు కల్పించి డబ్బులు స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. సగం మందికి రూ.245లు సగం మందికి రూ.287లు జమ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వేసవి దృష్ట్యా కూలీలకు తాగునీరు, ఇతర వసతులు కల్పించడం లేదని వాపోయారు. దీనిపై ఎంపీడీవో స్పందిస్తూ పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని తెలిపారు. కార్యదర్శి చైతన్య, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ సంఘాల నిరసన

ముసునూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వెబ్ కౌన్సిలింగ్‌కు వ్యతిరేకంగా ముసునూరు విద్యాశాఖ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు గాంగేయుడు, బాబురావు, పద్మకిషోర్ తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉన్నత విద్యాశాఖ అధికారులు గతంలో అన్ని ఉపాధ్యాయ సంఘాలను చర్చలకు పిలిచి ఎస్జీటీ ఉపాధ్యాయుల సౌకర్యార్థం బదిలీల్లో వారికి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని మాటిచ్చి, వెబ్ కౌన్సెలింగ్‌కు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. వెంటనే వెబ్ కౌన్సిలింగ్‌ను వెనక్కి తీసుకుని, హామీ ప్రకారం మాన్యువల్‌గా కౌన్సిలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సంఘాల నాయకులు సాయిబాబు, బెనర్జీ, విల్సన్, భాస్కరరావు, సుకుమార్, వరప్రసాద్, రత్నకుమారి, సీతాదేవి, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆలయ పునః ప్రతిష్ఠోత్సవాలు

మండవల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరవపట్నం పంచాయతీ శివారు శోభనాద్రిపురంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మచిలీపట్నానికి చెందిన అంజనేయ శర్మ ఆధ్వర్యంలోని రుత్వికులు ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. అన్న సమారాధన జరిగింది. ఆదివారం వైభవంగా పునః ప్రతిష్ఠ జరుగు తుందని గ్రామస్థులంతా పాల్గొనాలని ఆలయ నిర్వాహకులు భైరవానందం తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244



నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



కలిదిండిలో ముస్లిం సోదరుల ప్రార్థనలు



ఆగిరిపల్లి, గుడిపాడులో మతపెద్దల బోధనలు.. కైకలూరులో ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే కామినేని

త్యాగాలకు మారుపేరు బక్రీద్

»భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు» ఒకరనొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్న ముస్లింలు

కైకలూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): బక్రీదు త్యాగ గుణాన్ని తెలియజేస్తుందని ప్రపంచవ్యాప్తంగా మానవాళి దైవం బోధించిన మార్గంలో పయనించి శాంతి సౌభ్రాతృత్వాలతో జీవించాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆకాంక్షించారు. శనివారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో కైకలూరు ముస్లింల ఆధ్వర్యంలో బక్రీదు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల పట్ల సేవ, పొరుగ వారిపట్ల సహకార గుణాలతో, త్యాగ శీలమైన హృదయంతో శాంతియుతంగా జీవించడమే బక్రీద్ పండుగలోని పరమార్థమన్నారు. ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తానని అన్నారు. బక్రీదు శుభా కాంక్షలు తెలిపారు. జామియా మసీదు ప్రెసిడెంట్ అమీర్, చిన్నమసీదు ప్రెసిడెంట్ సర్కార్, మత పెద్దలు ఇల్లాఉల్‌హక్, ఫకురుద్ సలాం, ఎండీ సుల్తాన్, ఎండీ జానీ, షేక్ మూసా, రఫీబాషా, సయ్యద్ బషీర్, అన్వర్, షఫీరా తదితరులు పాల్గొన్నారు. కైకలూరు పెద్దమసీదు, చిన్నమసీదు ఆధ్వర్యంలో బక్రీదు ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మత పెద్దలు నమాజ్‌లు చేయించి దైవసందేశాన్ని అందించారు. అన్నివర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలు పరస్పరం ఆలింగనం చేసుకుని ఈద్‌ముబారక్ చెప్పుకున్నారు.

ముసునూరు: త్యాగానికి ప్రతిరూపమైన బక్రీద్‌ను శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గుడిపాడు, చెక్కపల్లి, గోపవరం, ముసునూరు తదితర గ్రామాల్లోని మసీదు ల్లో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరి నొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఏ మతమైనా తమ కున్నంతలో ఇతరలకు దానం చేయమని బోధి స్తుందని, అన్ని గుణాల్లోనూ దానగుణమే ఉత్తమమని, స్వార్థం లేకుండా మానవత్వంతో నడుచుకోవాలని మత గురువులు బోధించారు.

కలిదిండి: కలిదిండిలో ముస్లింలు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మూల్లంకలో మసీదులో ప్రార్థనలు జరిగాయి.

ముదినేపల్లి: బక్రీద్‌ను మండలంలో ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులో ప్రార్థనలు నిర్వహించారు. మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ బాబ్జీ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.

ఆగిరిపల్లి: మండలంలో బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. బక్రీద్ త్యాగానికి, సమాజ ఐక్యతకు ప్రతీకని మత పెద్దలు బోధించారు. మసీదుల్లో ప్రార్థనలు చేశారు. ముస్లింలు బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

చాట్రాయి: మండలంలోని మసీదులలో సామూహిక ప్రార్థనలు జరిగాయి. బక్రీద్ అంటే త్యాగానికి ప్రతీక అని మత పెద్దలు సందేశం ఇచ్చారు.



నెట్టెం రఘురామ్‌ను అభినందిస్తున్న నాయకులు

'నెట్టెం'కు టీడీపీ నాయకుల అభినందన

చాట్రాయి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నెట్టెం రఘరామ్‌ను విజయవాడలో శనివారం టీడీపీ మండల నాయకుడు మాదాసు చిన్న పుల్లయ్య తదితరులు కలిసి అభినందించారు. పీఏసీఎస్‌ల ద్వారా వ్యవసాయాభివృద్ధికి చేయూతను అందించాలని చైర్మన్‌ను కోరగా సానుకూలంగా స్పందించారని పుల్లయ్య చెప్పారు. చైర్మన్‌ను అభినందించిన వారిలో టీడీపీ నాయకులు బి. సుబ్రహ్మణ్యం(బుడ్డయ్య), పామర్తి చెన్నారావు, కందిమళ్ళ శ్రీరామమూర్తి, పసుపులేటి మురళి ఉన్నారు.



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, మంత్రి సారథి

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

కైకలూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): పేదల వైద్యానికి సీఎం సహాయనిధి ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శనివారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 9 మందికి చెక్కులను అందజేసి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి, వైద్యానికి అనేక రకాలుగా ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, కూటమి నేతలు గంగుల ఏసురాజు, కొల్లి వరప్రసాద్, ఫంగస్ శ్రీను, వేగిరెడ్డి సురేష్, పుప్పాల సూర్యప్రకాశరావు, తులసీ పూర్ణ, సయ్యద్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు/ఆగిరిపల్లి: ఆపత్కాలంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆగిరిపల్లి మండలం కొత్తఈదర గ్రామానికి చెందిన డి. రామారావు కుటుంబానికి రూ.1 లక్ష, చాట్రాయి మండలం పోతనపల్లి గ్రామానికి చెందిన కె. వీరయ్య కుటుంబానికి రూ.1.50 లక్ష అందజేశారు. ఈ సందర్భంగా ఎల్‌ఓసీని మంజూరు చేయించిన మంత్రికి బాధిత కుటుంబీకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బడి గంటలు మోగే వేళ..

సర్కారు బడుల్లో సమస్యలెన్నో

సర్కారు బడుల్లో చేరే పిల్లలందరికి దాదాపు అన్ని ఉచితమే. స్కూల్ యూనిఫాం, టై, బ్యాగు, బూట్లతో పాటు ..మధ్యాహ్న భోజనం కూడా.. రూపాయి ఫీజు చెల్లించనక్కర్లేదు. కానీ వేలకు వేలు దోపిడీ చేసే కార్పొరేట్ స్కూళ్లవైపే అందరూ చూస్తున్నారు. దీనికి విరుగుడుగా ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలను సమకూర్చాలని ఇంతకు ముందే భావించారు. ఉమ్మడి జిల్లాలో 2700కు పైగా పాఠశాలలకు తాగునీరే కాకుండా, ప్రహరీతో పాటు చక్కటి తరగతి గదులు, రంగులతో తీర్చిదిద్దారు. ఐదేళ్ల జగన్ జమానాలో నాడు-నేడు అంటూ నానా హడావుడి చేశారు. ఇప్పుడు ఆ పనులన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పాఠశాలలు మరికొద్ది రోజుల్లోనే తెరవనున్నారు. అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం విద్యావ్యవస్థ ప్రక్షాళనకు సిద్ధ పడింది. కానీ అనేకచోట్ల పాఠశాలల పరిస్థితి అత్యంత దారుణంగా ఉన్నాయి. ఎక్కడికక్కడ నిర్మాణాలు పిల్లర్ల స్థాయిలోనే నిలిచి కనిపిస్తున్నాయి. అదనపు తరగతి గదులు మూలన పడి వెక్కిరిస్తున్నాయి. రెండో విడతగా నాడు-నేడు పనులకు సరైన నిధులు సమకూర్చినా పరిస్థితుల్లో మార్పు రాలేదు. కనీసం గడిచిన రెండు నెలల్లో పనులు పూర్తిచేస్తే మధ్యలో నిలిచిన అదనపు తరగతి గదులు అందు బాటులోకి వచ్చి ఉండేవి. వీటన్నింటిపైన 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలన చేయగా అక్కడక్కడ వైఫల్యాల జాడే కనిపించింది. ముందు చూపు కొరవడి ఈ విద్యా సంవత్సరంలో కూడా విద్యార్థులు ఎప్పుడు మాదిరిగానే తిప్పలు పడక తప్పదా..? లేకుంటే ఇప్పటికైనా స్పందించి రోజుల వ్యవధిలో పనులు పూర్తి చేస్తారా..?

-ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

ఆంధ్రజ్యోతి పరిశీలన



వైవాక శివారు పెదగరువు దళితవాడ ఎలిమెంటరీ పాఠశాలకు అదుపు లేక కోతకు గురవుతున్న ఆవరణ



శిథిలావస్థకు చేరిన వేల్పుచర్ల మెయిన్ పాఠశాల భవనం

రక్షణ లేని విద్యార్థులు

ముదినేపల్లి : ముదినేపల్లి మండలంలోని మండల పరిషత్తు ప్రాథమిక, యూపీ పాఠశాలలు, జిల్లా పరిషత్ హైస్కూళ్ల స్థితి గతులను ఆంధ్రజ్యోతి పరిశీలించింది. మండలంలో 67 పాఠశాలలు ఉండగా, సుమారు 15 పాఠశాలలకు ప్రహరీ గోడలు లేక అదుపు లేని పరిస్థితుల్లో విద్యార్థులకు రక్షణ కరువైంది. వైవాక శివారు పెదగరువు, పెదగొన్నూరు శివారు ఉప్పరగూడెం, కొత్తపల్లి, వాడవల్లి శివారు బొబ్బిలిగూడెం ప్రాథమిక పాఠశాలలు చెరువుల పక్కనే ఉండటం, ప్రహరీ గోడలు లేకపోవటం ప్రమాదకరంగా ఉంది. చిగురుకోట, గురజ పాఠశాలలు రోడ్ల పక్కనే ఉన్నాయి. అప్పారావుపేట, ఉప్పరగూడెం, పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకోగా, నాడు-నేడు కింద చేపట్టిన 9 పాఠశాలల భవనాల పనులు అసంపూర్తిగానే మిగిలాయి.

శిథిలావస్థలో పాఠశాల

ముసునూరు : ముసునూరు మండల వ్యాప్తంగా ఏడు జడ్పీ పాఠశాలలు, ఒక బాలికల గురుకుల పాఠశాల, 45 ఎంపీపీ పాఠశాలలు, 8 ఎంపీయూపీ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో వేల్పుచర్ల మెయిన్ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. చెక్కపల్లి జడ్పీ పాఠశాలలో ప్రహరీ గోడ రెండు చోట్ల కూలిపోయి ఉంది. ఫేజ్-2 నాడు-నేడులో ప్రారంభించిన అదనపు తరగతి గదుల భవనాలు చెక్కపల్లి, రమణక్కపేట జడ్పీ హైస్కూల్స్‌లో పూనాది దశలో అసంపూర్తిగా ఉన్నాయి. గురుకుల బాలికల పాఠశాల, సూరేపల్లి, రమణక్కపేట, వేల్పుచర్ల గ్రామాల్లో ఉన్న పాఠశాలల చుట్టూ ప్రహరీ సౌకర్యం లేదు.

అడవిలో అటెన్షన్

(5వ పేజీ తరువాయి)

గిరిజన ప్రాంతాలను తమ షెల్టర్ జోన్లుగా వినియోగించుకునే వారు. 2000 సంవత్సరం మార్చి 17న జలతార్ వాగు వద్ద మొట్టమొదటి పోలీసులకు నక్సల్స్‌కు కాల్పులు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు నక్సల్స్, ఇద్దరు స్పెషల్ పార్టీ పోలీసులు మరణించారు. తర్వాత 2008 వరకూ పలు ఎన్‌కౌంటర్లు జరిగాయి. జిల్లాలో మొత్తం ఎనిమిది ఎన్‌కౌంటర్లు జరిగాయి. ఇందులో ముఖ్య నాయకులతోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన నాయకులు మరణించారు. అప్పటి నుంచి జిల్లాలో ఎక్కడా నక్సల్స్ జాడలేదు. కేంద్ర ప్రభుత్వం నక్సల్స్ రహిత జిల్లాగా గుర్తించింది. అయినప్పటికీ జిల్లాలో పోలీస్ యంత్రాంగం ఏజెన్సీ ప్రాంతాల్లో ముందస్తు చర్యలతో, స్పెషల్ పార్టీ పోలీసులు కూబింగ్ కొనసాగిస్తూనే ఉన్నారు.

అణువణువూ గాలింపు

మరోవైపు జాతీయ పోలవరం ప్రాజెక్టుకు 2000 డిసెంబరులో ఏలూరు సమీపంలో కలపర్రు వద్ద శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పోలవరం ప్రాజెక్టు పనులు జరుగుతున్న నేపథ్యంలో స్పెషల్ పార్టీ పోలీసులతో మన జిల్లాతోపాటు గోదావరి అటు వైపు ఉన్న తూర్పుగోదావరి జిల్లాలో కూంబింగ్ నిరంతరం కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టుకు వీవీఐపీల పర్యటనలు జరుగుతున్న నేపథ్యంలో ముందస్తుగా ప్రాజెక్టుకు 15 కిలోమీటర్ల నుంచి 30 కిలోమీటర్ల పరిధి వరకూ మూడంచెల భద్రతతో కూంబింగ్ కొనసాగిస్తున్నారు.

ఎప్పటికప్పుడు ఆర్మ్‌డ్ రిజర్వుడు స్పెషల్ పార్టీ పోలీసులతో, యాంటీ నక్సల్స్ బృందాలు, పోలీసు జాగిలాలతో అటవీ ప్రాంతంలో జల్లెడ పడుతూనే ఉన్నారు. జిల్లా పోలీస్ యంత్రాంగం తీసుకునే చర్యలతో నక్సల్స్ కదలికలు తగ్గిపోయాయి. ఇటీవల ఛత్తీస్‌గడ్, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎన్‌కౌంటర్లు జరగడం, పెదపాడు మండలం సత్యవోలుకు చెందిన సుధాకర్ ఎన్‌కౌంటర్‌లో మరణించడంతో పోలీస్ యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. కేంద్ర, రాష్ట్ర నిఘా సంస్థల సూచనలతో ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో పోలవరం, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు ప్రాంతాల్లో పర్యటనలు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు రద్దు చేసుకోవాలని సూచనలు రావడంతో ఆ దిశగా చర్యలు చేపట్టారు.

భయపడాల్సిన పనిలేదు : ఎస్పీ కేపీఎస్ కిశోర్

జిల్లాలో మావోయిస్టు/నక్సల్స్ కదలికలు లేవు. ఇంటిలిజెన్స్ ఉన్నతాధికారుల ఆదేశాలతో ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు ఎవరు భయపడాల్సిన అవసరం లేదు. ఇప్పటికే కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం ప్రాంతాల్లో స్పెషల్ పార్టీ పోలీసులు, యాంటీ నక్సల్స్ స్క్వాడ్, పోలీస్ జాగిలాలు, బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌లు, ఎక్స్‌ప్లోజివ్ డిటెక్ట్ టీమ్‌లు, హైఫ్రీక్వెన్సీ డ్రోన్లతో నిఘా పెట్టాం. అవసరమైన అదనపు బలగాలను ఏజెన్సీ ప్రాంతంలో ఉంచి ముందస్తు చర్యల్లో భాగంగానే గాలింపు నిర్వహిస్తున్నాం. ఇటీవల ఛత్తీస్‌గడ్, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎన్‌కౌంటర్లు జరగడం, ఛత్తీస్‌గడ్ ప్రాంతంలో పూర్తి నిర్బంధం వున్న నేపథ్యంలో ఒకవేళ అటు నుంచి మావోయిస్టులు షెల్టర్ జోన్‌గా జిల్లాను వినియోగించుకోవడానికి జిల్లాలోని అటవీ ప్రాంతాలకు వచ్చే అవకాశాల నేపథ్యంలో జల్లెడపడుతున్నాం.

వేలేరుపాడులో ఏం జరుగుతోంది ?

(5వ పేజీ తరువాయి)

అవకాశాలు ఉంటాయని భావిస్తున్న పోలీసులు అప్రమత్తమయ్యారు.

మేడేపల్లి, రామవరం పంచాయతీల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణాలకు శంకుస్థాపన చేసేందుకు శనివారం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పర్యటన ఖరారైంది. అయితే శంకుస్థాపన చేసే గ్రామాలు అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండడంతో భద్రతా చర్యల్లో భాగంగా చివరి నిమిషంలో పోలీసు అధికారుల సూచనలతో పర్యటన రద్దు చేసుకున్నారు. అభివృద్ధి పనులకు కూటమి నాయకులు భూమి పూజ చేసి ముగించారు.

డీపీవో ఆదేశాలపై తర్జన భర్జన

ముదినేపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి పంచాయతీలో నాలుగేళ్లుగా జరిగిన ఆర్థిక అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కైకలూరు పంచాయతీ సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి చేసిన ఫిర్యాదుపై విచారణ జరిపి సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి అనూరాధ జారీ చేసిన ఆదేశాలు తర్జన భర్జనకు దారి తీశాయి. ఈ నెల 2న జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో ముదినేపల్లి పంచాయతీలో 2021 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మే 31 వరకు జరిగిన అవకతవకలపై విచారణ జరిపాలని కైకలూరు సర్పంచ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ నిర్వహించాలని ముదినేపల్లి డిప్యూటీ ఎంపీడీవోకు జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు జారీ చేయటం పంచాయతీ పాలకవర్గంలో చర్చనీయాంశం కాగా, ముదినేపల్లి పంచాయతీ వ్యవహారాలపై కైకలూరు సర్పంచ్ విచారణ కోరటం వెనుక అంతర్యమేమిటన్నది ప్రశ్నార్థకంగా ఉంది. తమ గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందని విచారణ అధికారులు నిర్ధారించారన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో కైకలూరు సర్పంచ్ నవరత్న కుమారి వేరే పంచాయతీపై ఫిర్యాదు చేయటమేమిటన్నది కూడ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక సర్పంచ్ మరో పంచాయతీపై ఫిర్యాదు చేయటం చట్ట ప్రకారం సమర్థనీయమా, కాదా అన్నది చర్చకు దారి తీసింది. తనకు సంబంధం లేని ముదినేపల్లి పంచాయతీపై కైకలూరు సర్పంచ్ ఫిర్యాదు చేయటం ఏమిటని పంచాయతీ పాలకవర్గ సభ్యులతోపాటు, పలువురు నాయకులు, గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

ఎన్‌కౌంటర్లు ఆపాలి

చాట్రాయి, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కగార్ పేరుతో చేస్తున్న ఎన్‌కౌంటర్లు ఆపి కస్టడీలో ఉన్న మావోయిస్టులను కోర్టులో హాజరుపర్చాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి హరనాథ్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ కేంద్రంతో చర్చలు జరిపేందుకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించినా, పట్టించుకోకుండా ఆదివాసీలను కాల్చి చంపటం అమానుషమన్నారు. ఎదురు కాల్పులన్నీ బూటకమని తేలిపోయిందని, వేలాది మంది సైన్యం ఏకపక్షంగా శత్రువులను వేటాడినట్లు మావోయిస్టులపై నరమేధం కొనసాగించటం దారుణమన్నారు.

చటాకాయ్ సర్పంచ్ ఆకస్మిక మృతి

కైకలూరు, జూన్ 7(ఆంధ్రజ్యోతి): చటాకాయ సర్పంచ్ ఘంటసాల శేషారావు (55) శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. గ్రామంలో రెండోసారి సర్పంచ్‌గా పనిచేస్తున్న ఆయన అస్వస్థతకు గురై మృతి చెందారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, రాష్ట్ర వడ్డి సాధికార కమిటీ కన్వీనర్ బలే ఏసురాజు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన మరణం కుటుంబసభ్యులకు తీరని లోటన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

ముదినేపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక వ్యక్తి తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఇది. పుట్టింటి వద్ద ఉన్న భార్య దగ్గరకు వెళ్లి తిరిగి వచ్చిన అనంతరం ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి శివారు బండ్ల గూడెం గ్రామానికి చెందిన యెహోషువా (36)కు కైకలూరు మండలం కొట్టాడకు చెందిన సంధ్యకు పదేళ్ల క్రితం వివాహమైంది. యెహోషువా ముదినేపల్లి మండలం పేరూరు గ్రామంలో ఒక చేపల చెరువుపై పనిచేస్తూ ఆ గ్రామంలోనే భార్యా పిల్లలతో నివాసం ఉంటున్నాడు. ఏడాదిగా భార్యాభర్తల మధ్య విబేధాలు తలెత్తాయి. కొంతకాలంగా భార్య కొట్టాడలోని పుట్టింటి వద్దే ఉంటున్నది. ఈ పరిస్థితుల్లో శుక్రవారం యెహోషువా భార్య దగ్గరికి వెళ్లి తిరిగి రాత్రికి పేరూరు వచ్చి తాను నివాసం ఉంటున్న ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై మృతుడి సోదరుడు సాల్మన్ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి హెడ్ కానిస్టేబుల్ శంకరరావు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వివాహిత..

మండవల్లి జూన్ 7(ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవపడి ఓ వివాహిత మనస్థాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో శనివారం వెలుగు చూసింది. మండవల్లి ఎస్సై రామచంద్రరావు వివరాల ప్రకారం మండలంలోని గున్నన పూడి శివారు లేళ్లపూడి గ్రామానికి చెందిన కోరం సతీష్‌కు రాజేశ్వరితో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు. శుక్రవారం కుటుంబ వ్యవహారాల నేపథ్యంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అనంతరం సతీష్ పనికి వెళ్లిపోగా, మనస్థాపానికి గురైన రాజేశ్వరి మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇంటిలోనే రేకుషెడ్డుకు ఉన్నరాడ్డుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసినట్టు, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగిస్తామని ఎస్సై తెలిపారు.